JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 02-08-2026
Medchal - Malkajgiri । Sunday 02-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 62
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 62 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ

- వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం.. ముందస్తు చర్యలతో నష్టాల నివారణ
- లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు

**జయభేరి, ఏటూరు నాగారం :**

ఏటూరు నాగారం మండలం కేంద్రం లోని రామన్న గూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని రాష్ట మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా తెలంగాణ తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉప్పొంగుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, వాగులు,

...మిగతాది 2 లో

# సీఎం రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్



- 20 రోజుల పాటు అమెరికా, యూకే సహా పలు దేశాల్లో పర్యటన
- అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో అగ్రగామి సంస్థల ప్రతినిధులతో సమావేశాలు
- వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్ మూడో వారంలో నిర్వహించే దిశగా రాష్ట ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక విదేశీ పర్యటనకు రెడీ అవుతున్నారు. ఆగస్ట్ 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు దాదాపు 20 రోజుల పాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో పాటు మరికొన్ని దేశాల్లో పర్యటించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రపంచస్థాయి కంపెనీలు, మల్టీ నేషనల్ కంపెనీలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణలో పెట్టుబడులు పెంచే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు. ఈ విదేశీ పర్యటనలో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ వంటి వ్యూహాత్మక రంగాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రధాన దృష్టి పెట్టనున్నట్లు సమాచారం.

అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో అగ్రగామి సంస్థల ప్రతినిధులతో సమావేశాలు జరగనున్నాయి. లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యాసంస్థల ప్రతినిధులతోనూ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో జరిగిన విదేశీ పర్యటనల్లో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంవోయూల) అమలు పురోగతిని కూడా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన లేదా కొత్తగా పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్న అంతర్జాతీయ కంపెనీలతో సమావేశాలు నిర్వహించి మరిన్ని ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్, ఫ్యూచర్ సిటీ, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీలు), స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలను పెట్టుబడిదారులకు వివరించే అవకాశముంది. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ షెడ్యూల్‌పైనా కసరత్తు కొనసాగుతోంది.

చట్టసభల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ ఆగస్ట్ నెల మధ్యలో ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ఇప్పటికే ప్రభుత్వ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అలాగే వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్ మూడో వారంలో నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విదేశీ పర్యటన ముగించుకుని సీఎం రేవంత్ రెడ్డి సెప్టెంబర్ రెండో వారంలో రాష్ట్రానికి చేరుకున్న తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.












# భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభించిన ప్రధాని మోదీ

- భోగాపురం, విశాఖ ఎయిర్‌పోర్ట్‌లపై కేంద్రం ప్రకటన
- ఆగస్టు 17 అర్ధరాత్రి నుంచి భోగాపురంలో విమానాలు
- అదే సమయంలో విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఫ్లైట్లు బంద్

**జయభేరి, విజయనగరం :**

విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆగస్టు 1న ప్రారంభంకానుంది. ఈ వేడుకకు ఏపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రారంభోత్సవ వేళ కేంద్రం భోగాపురం, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతాయని కేంద్ర పౌరవిమానయానశాఖ తెలిపింది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న ఇంటర్నేషనల్ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం ఈ ప్రకటనలో తెలిపింది.

ఇది కూడా ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అమలవుతుందన్నారు. అదే సమయంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమానాలు కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.






విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి 30 ఏళ్లపాటు షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలు ఆగిపోతాయని ప్రకటనలో తెలిపారు. కాకపోతే ఏవైనా జాతీయ అత్యవసర పరిస్థితులు ఎదురైతే మాత్రం ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని కూడా తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. నాన్‌షెడ్యూల్డ్ కమర్షియల్ కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపారు. అంతేకాదు భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి పౌరవిమానయానశాఖ మరో కీలకమైన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎయిర్‌పోర్ట్‌కు 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేస్తున్నట్లు తెలిపింది. 2024 సెప్టెంబర్ 18న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయం తీసుకోగా.. కేంద్రం అధికారికంగా గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇటు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడుతో కలిసి మంత్రి లోకేష్ సమీక్షించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు వివరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

ఈ చారిత్రక ఘట్టానికి సాక్షులుగా నిలవాలన్నారు. అలాగే ఈ వేడుకను చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా జరపాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. వేడుకలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- భూముల ధరల సవరణతో స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ల ఆదాయం 20% వరకు పెరుగుదల
- త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులు చెల్లిస్తాం

**జయభేరి, హైదరాబాద్ :**

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు.

## హైడ్రా అభివృద్ధి చేసిన.. ఉప్పల్ నల్ల చెరువుకు జలకళ

- వర్షాలతో చెరువుకు భారీగా వరద నీరు



**జయభేరి, ఉప్పల్, ఆగస్టు 1:**

హైడ్రా పునరుద్ధరించిన ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండింది. భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఈ చెరువును హైడ్రా పునరుద్ధరిస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ క్రమంలో వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా.. తక్కువ మొత్తంలో పారే మురుగు నీరు బైపాస్ చేసిన కాలువలోంచి బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువున ఉన్న ప్రాంతాలు నీట మునగకుండా వరదనీరు నల్లచెరువుకు చేరింది. ఉప్పల్ నల్లచెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలు తొలగించి 70 ఎకరాల వరకు విస్తరించిన విషయం విదితమే. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తోంది.

## ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికింది

- ఇక పై దశ, దిశ మారతాయి: సీఎం చంద్రబాబు

**జయభేరి, భోగాపురం :**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. భోగాపురం ఎయిర్ పోర్టును ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనం ఈ ఎయిర్‌పోర్టు అని అన్నారు. భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. కర్షకులు కేవలం భూములు ఇవ్వలేదని, ఈ ప్రాంతానికి ఓ బంగారు భవిష్యత్తును ఇచ్చారని ఆయన కొనియాడారు. ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు ఓ మణిహారమని, దీని ద్వారా ఈ ప్రాంత ప్రజల కలలకు రెక్కలు వచ్చాయన్నారు. ఈ విమానాశ్రయంతో ఈ ప్రాంతం దశ, దిశ మారతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్రకు గూగుల్, స్టీల్ కంపెనీతో పాటు చాలా సంస్థలు వచ్చాయని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశాని, అలాంటి పరిస్థితుల్లో, కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన వ్యక్తి మోదీ అని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా సభికులందరితో 'థ్యాంక్యూ పీఎం, ధన్యవాదాలు పీఎం' అని నినదించి ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రజలకు శాశ్వత రక్షణ

గోదావరి పరివాహక ప్రాంతాలు, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని వివరించారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాల్లో జిల్లా ఉన్నత అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. గతంలో రామన్నగూడెంలోకి వరద నీరు చేరేదని, ఈసారి ముందస్తు చర్యలతో ఆ ప్రమాదాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో కరకట్ట నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలు వరదలు, వాగులు ఉప్పొంగిన సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల సమయంలో అడవుల్లోకి పశువులను మేపేందుకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022, 2023 సంవత్సరాల్లో గోదావరి, జంపన్నవాగు వరదల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కరకట్ట పనులను కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి రన్ వే

- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారం.. చంద్రబాబు
- విమర్శించడం చాలా తేలిక
- ఎర్రబస్సు రాని చోటుకు ఎయిర్ పోర్టు వచ్చింది
- బొబ్బిలి వీణ బహూకరణ

**జయభేరి, విజయనగరం, ఆగస్టు 1 :**

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోను చేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదే విధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారం.. చంద్రబాబు**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త



చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు.

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

**చేసే పనితోనే సమాధానం**

ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వ్యాఖ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితమైన చారిత్రాత్మక ఘట్టంతో ఇప్పుడు ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షాల హేళనలకు తమ అభివృద్ధి పనులతోనే సమాధానమిచ్చామని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ఒక బలమైన సింహద్వారంలా నిలుస్తుందని, దీని ద్వారా రాబోయే రోజుల్లో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. "ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని కేవలం ఎర్రబస్సులు మాత్రమే తిరిగే వెనుకబడిన ప్రాంతం అని కొందరు అవహేళన చేశారు.

కానీ ఈ రోజు కళ్లు తెరిచి చూడండి.. ఎర్రబస్సులు తిరిగిన నేలపైనే అధునాతన ఎయిర్‌బస్సులు ల్యాండ్ అయ్యే స్థాయికి ఉత్తరాంధ్ర ఎదిగిందని నిరూపించాం" అని విమర్శకులకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యంత వేగంగా ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వెల్లడించిన రామ్మోహన్‌నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంపై ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచం గర్వించే నాయకుడు ప్రధాని మోదీ నేతృత్వంలో 'వికసిత్ భారత్', ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 'విజన్ 2047' లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉత్తరాంధ్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

**విమర్శించడం చాలా తేలిక**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

**ఎర్రబస్సు రాని చోటుకు ఎయిర్ పోర్టు వచ్చింది**

ఎర్ర బస్సు కూడా రాని చోటుకు ఎయిర్‌బస్ అవసరమా? అని ఎగతాళి చేసిన చోటే ఇప్పుడు విమానాశ్రయం వచ్చిందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో కొందరు ఉత్తరాంధ్రను తక్కువగా చూసి, ఇక్కడి ప్రజలను అవమానించారని ఆయన విమర్శించారు. "ఎర్ర బస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది, మన ప్రధాని మోదీ వచ్చారు. ఇదే మన ఉత్తరాంధ్ర దెబ్బ, అర్థమైందా రాజా!" అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి పదునైన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు ప్రధాని నరేంద్ర మోదీ రెక్కలు తొడిగారని లోకేశ్ కొనియాడారు. ప్రధాని సహకారంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. నమో అంటే.. హిమ్మత్ (ధైర్యం), విశ్వాస్ (నమ్మకం), సురక్షిత్ భారత్ (సురక్షిత భారతం) అని ఆయన వివరించారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలకం కానుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి ఒక పవర్ ఇంజిన్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. విమానాశ్రయాన్ని వేగంగా నిర్మించిన జీఎంఆర్ సంస్థను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**బొబ్బిలి వీణ బహూకరణ**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ జస్టిస్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, అశోక్‌గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోదీ టెర్మినల్ భవనంలో కలియదిరిగి ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. విమానాశ్రయం ప్రత్యేకతలు, నిర్మాణ విశేషాలను జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లిఖార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర కళావైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను బహూకరించి సత్కరించారు. అంతకు ముందు సభా ప్రాంగణానికి ఓపెన్ టాప్ జీపులో వస్తూ మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని మోదీ వీక్షించారు. ఇటీవలే గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన థింసా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది యువతులు ప్రదర్శించిన ఈ నృత్యాన్ని చూసి ప్రధాని ఆసక్తి కనబరిచారు. ఈ క్రమంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

# సీజేపీ సైలెంట్ ఉద్యమం

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది.విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు.సీజేపీలో అశుతోష్‌రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020-21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ,



ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం.2021-22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టిసారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది.మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫేస్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి.కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి.తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటున్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయిజంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి.రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుంటుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

---



## విద్యార్థులను “క్రిమినల్ వేస్ట్” అని సంబోధించడం దుర్మార్గం

- **అధికార మదంతో విద్యార్థులను అవమానించడం తగదు**
- **సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి**

జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 01 :

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి “క్రిమినల్ వేస్ట్” వంటి అవమానకరమైన పదజాలాన్ని ఉపయోగించడం అత్యంత దుర్మార్గమని, బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి నోటి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం తెలంగాణ విద్యార్థి లోకాన్ని అవమానించడమేనని బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థులు, యువత రాష్ట్ర భవిష్యత్తుకు వెన్నెముక లాంటివారని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుంటూ తమ భవిష్యత్తును నిర్మించుకుంటున్న విద్యార్థులను ముఖ్యమంత్రి అవమానించడం సరికాదన్నారు. అధికారం శాశ్వతం కాదని, కానీ విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. విద్యార్థుల్లో నైపుణ్యాల లోపం ఉంటే దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, నాణ్యమైన విద్య, ఆధునిక సాంకేతిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సింది పోయి విద్యార్థులనే నిందించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నమే అని చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి విమర్శించారు. విద్యార్థులను “క్రిమినల్ వేస్ట్” అని పిలిచే హక్కు ఎవరికీ లేదని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి పదజాలాన్ని ఉపయోగించడం రాష్ట్రంలోని ప్రతి విద్యార్థిని, వారి తల్లిదండ్రులను అవమానించడమేనన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న విద్యార్థులను అవమానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. “విద్యార్థులు క్రిమినల్ వేస్ట్ కాదు.. తెలంగాణ భవిష్యత్తుకు దిక్సూచి. యువత సమస్య కాదు.. రాష్ట్ర అభివృద్ధికి చోదకశక్తి” అని చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార మదాన్ని పక్కనపెట్టి విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని, అవమానకర వ్యాఖ్యలు చేయకుండా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు. విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే సీఎం వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని, విద్యార్థులు, యువత పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

---

## పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ..

- **బీజేపీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ షాద్‌నగర్ అసెంబ్లీ సమన్వయకర్తగా నియమితులైన పసుల నరసింహ యాదవ్‌కు ఘన సన్మానం**

జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 1 :

తెలంగాణ ఎండోమెంట్ సెల్ సమన్వయ కర్తగా షాద్ నగర్ బీజేపీ నేతగా పసుల నరసింహను ఘనంగా సన్మానించిన షాద్ నగర్ బీజేపీ నేతలు. ఈ సందర్భంగా పసుల నరసింహ యాదవ్ మాట్లాడుతూ...





తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, షాద్‌నగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ 9వ వార్డు కౌన్సిలర్ ప్యాట అశోక్,బీజేపీ యువ నాయకుడు వంశీ కృష్ణ, హాజీపల్లి ఉపసర్పంచ్ గంగాధర్, నాగులపల్లి ఉపసర్పంచ్ సుమన్ బీజేపీ సీనియర్ నాయకులు సుధాకర్ అప్పా, బాల్ రెడ్డి, కుడుముల బాలరాజు, బందయ్య,గిరాయిగుట్ట వార్డు సభ్యుడు గణేష్, భాస్కర్ పటేల్,శ్రవణ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఆటో డ్రైవర్ల పొట్ట కొడ్తున్నారు

- **మంద రవికుమార్**

జయభేరి, షాద్ నగర్ :

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లను మభ్య పెట్టడం మానుకొని, 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వెంటనే అమలు చేయాలని ఆటో జేఏసీ నాయకులు మంద రవికుమార్, అన్నారు. ఆగస్టు 1వ తేదిన ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భం గా గోదావరిఖని బస్టాండ్ అడ్డాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్,ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హు లైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి 12వేలు ఇవ్వాలని, ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, ప్రభు త్వం ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. స్వాతంత్రం వచ్చిన ప్పటి నుండి



ఇప్పటి వరకు ఎందరో ముఖ్యమంత్రులను చూసాం కాని, కార్మికుల పొట్టలు కొట్టే ముఖ్యమంత్రిని ఇంతవరకు చూడ లేదని అన్నారు. ఇచ్చిన హామీలను మరిచి మళ్లీ కొత్తగా ఆటో డ్రైవర్లను మోసం చేయడానికి,,ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైలు వరకు ఆర్టీసీ ఆటోలు అనే కార్యక్రమాన్ని తీసుకు రావడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని అన్నా రు.ఆటో డ్రైవర్లను మోసం చేసే ఇలాంటి పథకాలను మేము సహించబోమని మంద రవికుమార్, హెచ్చరించారు. రామగుండం కార్పొరేషన్ ఆటో జేఏసీ అధ్యక్షులు ఎండి బురహన్, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కో కన్వీనర్ ఎస్ కే జబ్బర్, జిల్లా నాయకులు కాజీపేట రాజయ్య, పల్లెబాపు, రాజేశం, మడిపెద్ది రమేష్, షరీఫ్ తదితరులు అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

---



## ఆత్మ కమిటీ డైరెక్టర్ గా జింకల ఎల్లేష్ యాదవ్ నియామకం

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన జింకల ఎల్లేష్ యాదవ్ ని ఆలేరు నియోజకవర్గం ఆత్మ కమిటీ డైరెక్టర్గా నియమించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొత్త రాములు, గ్రామ కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి బాలరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ, వార్డు సభ్యులు జల్ల గణేష్, గడిపే నరసింహులు, కలకుంట్ల రజిత, నాయకులు జక్కుల శ్రీశైలం, సిరిగిరి వెంకటేష్, ఆలేటి శ్రీశైలం, జూపల్లి తిరుపతి, ఆవుల కృష్ణమూర్తి, కలకుంట్ల బాలయ్య, కలకుంట్ల శ్రీకాంత్, భాదిని బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

---

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని ఒకటి రెండు అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని వాటిలో అధిక విలువైన పోషకాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమాలలో గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, సిడిపిఓ స్వరాజ్యం, సూపర్వైజర్ జ్యోతి, డాక్టర్ సూర్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఆర్.బి.ఎస్.కె, డాక్టర్ ప్రశాంత్, అంగన్వాడీ టీచర్లు పుట్ట సునీత, తోట భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్ వరలక్ష్మి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

---

## బదిలీపై వెళ్తున్న ఏఈఓ ను సన్మానించిన సర్పంచ్



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామ ఏ ఈ ఓ గా విశేష సేవలు అందించిన జెస్సీ బదలీ కావడంతో ఇబ్రహీంపురం గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వీడుకోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దత్తాయ పల్లి క్లస్టర్ లో 8 సంవత్సరాల పాటు రైతులకు విశేష సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మెండు రామ్మోహన్ రెడ్డి, పండుగ జహంగీర్, గడ్డమీది బాలకృష్ణ, నాగారం, కరుణాకర్, గ్రామపంచాయతీ కారోబార్ రేసోజు రాజు, అంగన్వాడి టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది ,గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

---

## ఆత్మ కమిటీ డైరెక్టర్ ను సన్మానించిన మాజీ ఉపసర్పంచ్



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :

యాదగిరిగుట్ట బ్లాక్ ఆలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్గా ఎన్నికైన తుర్కపల్లి మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన పండుగ జహంగీర్ ను ఇబ్రహీంపురం మాజీ ఉపసర్పంచ్ మన్నెపు తిరుపతిరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మెండు రామ్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎడ్ల అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డమీది బాలకృష్ణ, పాశం గోవర్ధన్ రెడ్డి, నాగారం కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

---

## మృతురాలి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఎడపల్లి బాలమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోట జహంగీర్, గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, నాయకులు బోరెడ్డి మహిపాల్ రెడ్డి, ఎండి గౌస్, బొల్లారం జగదీష్, వార్డు సభ్యులు కోట జాన్సన్, కూరెళ్ళ బాలకృష్ణ, అరిగే మైపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా భూక్య రమేష్ నాయక్ నియామకం

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :**

ఉద్యమకారుల సంఘం తుర్కపల్లి మండలం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బిలియా నాయక్ తండ గ్రామపంచాయతీకి చెందిన భూక్య రమేష్‌నాయక్ ని నియమిస్తున్నట్లు తుర్కపల్లి మండల ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు కోట సురేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రతి ఉద్యమ కారునికి 200 గజాల ఇంటి స్థలముతో పాటు, 30 వేల రూపాయల ఫంక్షన్స్ సౌకర్యంతో పాటు, ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డులను ఇచ్చి గౌరవించాలని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యమకారునికి న్యాయం జరిగేంతవరకు ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్, ఉద్యమకారుల సంఘం స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు సీస మహేశ్వరి, ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు ఎరుకల వెంకటేష్ గౌడ్, నల్ల రాజు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 01 :**

పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించాలని సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామస్తులకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం కోసం భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని పచ్చని వెంకటాపురం నిర్మాణానికి ప్రతి గ్రామస్తులు తన వంతు బాధ్యతగా ముందుకు రావాలని అన్నారు. మొక్క నాటడం మన బాధ్యత మొక్కను సంరక్షించడం మన సంస్కారం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉదయ్ రెడ్డి, గ్రామ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు కొడపాక అక్షిత మహేష్, నారా నాగరాజు, పల్లెపాటి అనిల్, గుంటి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మాధవి, అంగన్వాడి టీచర్ స్వప్న, ఆశా వర్కర్ వనజ, గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల దశరథ, అరుణ, గ్రామస్తులు నీలాద్రి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన

- చౌదర్‌పల్లిలో పీజేటీఎస్‌ఏయూ విద్యార్థుల పిఆర్‌ఏ కార్యక్రమం



**జయభేరి, వర్గల్, ఆగస్టు 1 :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (రాజేంద్రనగర్)కు చెందిన విద్యార్థులు శనివారం చౌదర్‌పల్లి గ్రామంలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (PRA) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రవి ముఖ్య అతిథిగా హాజరై గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. గ్రామ సమస్యలను గుర్తించి వాటికి ప్రజల భాగస్వామ్యంతో పరిష్కార మార్గాలను రూపొందించడంలో పిఆర్‌ఏ విధానం సమర్థవంతంగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త డా. పల్లవి రైతులతో సమావేశమై శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, పంటల సమర్థ నిర్వహణ, నేల ఆరోగ్య పరిరక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యార్థులు గ్రామంలో సామాజిక పటం, వనరుల పటం, ట్రాన్సెక్ట్ వాక్ వంటి PRA కార్యక్రమాలను నిర్వహించి గ్రామ ప్రజలతో కలిసి వివిధ అంశాలపై సమాచారాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్‌కు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యార్థుల గ్రామీణ అధ్యయన కార్యక్రమం

- గ్రామ ఊహ చిత్రాన్ని వేసిన వ్యవసాయ విద్యార్థులు

**జయభేరి, గజ్వేల్, ఆగస్టు 01 :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTAU, రాజేంద్రనగర్) 4వ సంవత్సరం విద్యార్థులు తమ 'రావెప్' (RAWEP) అధ్యయనంలో భాగంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖల్స గ్రామంలో 'పాల్గొనే గ్రామీణ అంచనా' (PRA) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక రైతులతో కలిసి గ్రామానికి చెందిన భౌగోళిక నమూనా, సాగు భూములు మరియు నీటి వనరులను ప్రతిబింబించే సామాజిక పటం ప్రదర్శించారు. అనంతరం పంట దిగుబడుల పెంపు, చీడపీడల నివారణ మరియు ఆధునిక సాగు పద్ధతులపై రైతులతో ముఖాముఖి నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండగల్ల గణేష్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, TRVK సీనియర్ సైంటిస్ట్ మరియు RAWEP హెడ్ పల్లవి , AEO అనిత, స్థానిక గ్రామ పెద్దలు, రైతులు మరియు వ్యవసాయ విద్యార్థినులు వెంకట హర్షిని , లావణ్య, హర్షద, భార్గవి, ప్రవీణ మరియు అనూష పాల్గొన్నారు.

# పౌర సమస్యలపై కమిషనర్ సృజన సమీక్ష

- వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో ప్రజలతో ముఖాముఖి

**జయభేరి, మేడ్చల్ :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ సూదంష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు మేడ్చల్ సర్కిల్‌లోని మేడ్చల్ వార్డును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో సమావేశమై వార్డు పరిధిలో నెలకొన్న పౌర సమస్యలు, అభివృద్ధి అవసరాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రజలు గుంతలు పడిన రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, ఎన్జీవోస్ కాలనీ-రాఘవేంద్ర నగర్ కాలనీల మధ్య ఓపెన్ నాలాపై వంతెన నిర్మాణం, అవసరమైన ప్రాంతాల్లో బాక్స్ డ్రెయిన్ల ఏర్పాటు, పార్కులు, స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి, తుమ్మ చెరువు వద్ద కొత్త వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా బస్ డిపో సమీపంలోని వ్యర్థాల తొలగింపు, ఎయిర్‌టెక్ యంత్రాల మరమ్మతులు, దోమల నివారణ చర్యలు, తాగునీటి సరఫరా మెరుగుదల, కొత్త యూజీడీ (UGD) లైన్ల ఏర్పాటు, చెరువుల్లోకి డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు తీసుకోవడం, ఎల్‌ఆర్‌ఎస్ (LRS) సంబంధిత సమస్యల పరిష్కారం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయని కమిషనర్ సృజన తెలిపారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి, పౌర సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, వార్డు స్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవడమే "వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కమిషనర్ సృజన తెలిపారు.






### గత కౌన్సిల్ తీర్మానాల పనులు పూర్తి చేయాలి :- మాజీ ప్రజాప్రతినిధుల వినతి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వన్ వార్డ్ ఎవ్రీడే' కార్యక్రమంలో భాగంగా శనివారం మేడ్చల్ డివిజన్‌లో కమిషనర్ సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్, మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్‌తో పాటు మున్సిపల్ అధికారులు విస్తృతంగా పర్యటించారు.

ఈ సందర్భంగా మేడ్చల్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ 297వ డివిజన్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ మున్సిపాలిటీ సీఎంసీలో విలీనమైన తర్వాత గత కౌన్సిల్ సమావేశాల్లో ఆమోదించిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వాటిని వెంటనే పునః ప్రారంభించాలని కోరారు. రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, చెరువులు, పార్కుల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో విలీనం అనంతరం ప్రజలు మౌలిక వసతుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో ప్రజల అవసరాల దృష్ట్యా ఆమోదించిన తీర్మానాలకు నిధులు కేటాయించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్‌కురుమ, కౌడే మహేష్‌కురుమ, పానుగంటి రవీందర్, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్, కనకాల శివకుమార్ (బిపిటిరాజు), రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, మేకల రాజశేఖర్ రెడ్డి, లవంగు రాకేష్ వంజరి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటానికి శ్రీకారం

- ఎస్‌డీవీపీ జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ
- ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 01 :**



సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ ఏర్పాటైన సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ఎస్‌డీవీపీ జేఏసీ) తన కార్యాచరణను ప్రారంభించింది. కమిటీ ఆధ్వర్యంలో శనివారం సిద్దాపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో డంపింగ్ యార్డు వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు వల్ల కేవలం ఒక గ్రామానికే కాకుండా షాద్‌నగర్ నియోజకవర్గంలోని సుమారు 50 గ్రామాలు, నాలుగు నియోజకవర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంత భవిష్యత్తుకు ఇది పెద్ద ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు రద్దు అయ్యే వరకు పార్టీలకు అతీతంగా ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జేఏసీ ఇచ్చే ప్రతి ఉద్యమ పిలుపునకు ప్రజలు పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేసి ప్రజల తరఫున ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీవీపీ జేఏసీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్య, సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, కోచైర్మన్లు వడ్డే బాలయ్య, బిత్యా నాయక్, కోకన్వీనర్లు ఈశ్వర్ నాయక్, బుద్ధుల జంగయ్య, రవీంద్రనాథ్‌తో పాటు జంగయ్య, మహేష్, భాస్కర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహమ్మద్ గౌస్ బాబా ఉర్సు వేడుకలు

- సాంప్రదాయ రీతిలో గందోత్సవం
- భక్తిశ్రద్ధలతో ఖత్మే ఖురాన్

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో కొలువుదీరిన హజరత్ ముహమ్మద్ గౌస్ బాబా దర్గా ఉర్సు వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ దర్గా ఉర్సు వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. గత 6 సంవత్సరాలుగా గౌస్ బాబా దర్గా ఉరుసు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఉరుసు వేడుకలను నిర్వహించారు. ఈ ఉరుసు వేడుకలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు ఉర్సు వేడుకలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దర్గాలోని బాబా సన్నిధిలో గుసూల్ షరీఫ్ కార్యక్రమాన్ని భక్తశ్రద్ధలతో సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా దర్గాను సర్వాంగ సుందరంగా అలంకరించారు. రంగు రంగు విద్యుత్ బల్బులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉరుసులో భాగంగా శుక్రవారం గందోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా గంధాన్ని స్థానిక పట్టణ పురవీధుల గుండా భారీ ఎత్తున ఊరేగించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో దేవరకద్రకు తరలి వచ్చారు. దీనికిగాను సాహెబ్ మురీద్ ల సౌకర్యార్థం దర్గా వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొక్కుబడి గల భక్తులు బాబా దర్గా పై పూల చాదర్లు కప్పి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఫాతెహాలు ఇచ్చారు. ఉర్సు వేడుకల్లో భాగంగా ఖత్మే కురాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉరుసు నిర్వాహకులు సజ్జాదే నశీన్ మహమ్మద్ మక్దూమ్ బాబా తెలిపారు.

## రేకులగడ్డ గ్రామ యువకుడికి వరుసగా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు

**జయభేరి, చందంపేట :**



చందంపేట మండలం రేకులగడ్డ గ్రామానికి చెందిన చిలకల జైరాం తండ్రి చిలకల గోవిందు ప్రభుత్వ రంగంలో వరుసగా రెండు స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలు సాధించి గ్రామానికి, మండలానికి గర్వకారణంగా నిలిచారు. జైరాం మొదటగా 2026 ఏప్రిల్ 24న నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు పరిధిలోని జిల్లా న్యాయ సేవా సంస్థ (District Legal Services Authority)లో స్టెనోగ్రాఫర్‌గా ఎంపికయ్యారు. తదనంతరం 2026 జూలై 29న మహబూబాబాద్ జిల్లా కోర్టు పరిధిలోని జిల్లా న్యాయ సేవా సంస్థ (District Legal Services Authority)లో కూడా స్టెనోగ్రాఫర్‌గా మరోసారి ప్రభుత్వ ఉద్యోగం సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన జైరాం కృషి, పట్టుదల, నిరంతర సాధనతో ఈ విజయాలను అందుకోవడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు ఆయనను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత, పారిశుధ్య లోపాలు

- బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

**జయభేరి, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత, పారిశుధ్య లోపాలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త, మురుగు నీరు, తెరిచి ఉన్న నీటి సంపు, బీర్ సీసాలు కనిపించడంతో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే వారంలోగా తామే స్వయంగా ఆసుపత్రిని శుభ్రం చేస్తామని బీఆర్ఎస్ నేత పొట్ట నరేందర్ యాదవ్ హెచ్చరించారు. శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, మురుగు నీరు, అపరిశుభ్ర వాతావరణం, పనిచేయని మరుగుదొడ్లు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో నీటి బోరు రెండేళ్లుగా పనిచేయడం లేదని, వాష్‌రూమ్‌లలో నీటి సౌకర్యం కూడా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. హెల్త్ సెంటర్‌లోని నీటి సంపు తెరిచి ఉండి పురుగులతో నిండిపోవడంతో దోమలు వ్యాపించి డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, గడువు ముగియడానికి కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉన్న మందులను రోగులకు అందిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బీర్ సీసాలు కనిపించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శాఖ పనితీరు పూర్తిగా క్షీణించిందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు... స్పందించకపోతే తమ స్వంత నిధులతో ఆసుపత్రిని శుభ్రం చేసి, బోరు వేయిస్తామని ప్రకటించారు.

## మనవరాలైన మైనర్ బాలికపై తాత అత్యాచారం



**జయభేరి, ములుగు :**

ములుగు జిల్లా వాజేడు మండలంలో అమానుష ఘటన వెలుగు చూసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. తలుపులు వేసి 14 ఏళ్ల బాలికపై తాత మోడెం కృష్ణయ్య అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించి.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురవ్వగా, నానమ్మ బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లింది. బాలిక గర్భం దాల్చిందని వైద్యులు చెప్పగా, బాలికను నిలదీసింది నానమ్మ. తాతయ్యే ఇలా చేశాడని మైనర్ బాలిక చెప్పడంతో.. కృష్ణయ్యను కుటుంబ సభ్యులు నిలదీసారు. అబార్షన్ చేపించి, పెళ్లి అయ్యే వరకు ఖర్చులు భరిస్తానని కృష్ణయ్య భరోసా ఇచ్చాడని బాలిక ఆరోపించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వస్తున్నాయి.

# యువ ఆవిష్కరణలకు సీఎంఆర్ థింక్‌ఫెస్ట్ 3.0 వేదిక

- రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా పాల్గొన్న యువ ఆవిష్కర్తలు.. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాల అందజేసిన చైర్మన్ గోపాల్ రెడ్డి




**జయభేరి, మేడ్చల్ :**
భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారి ఆలోచనలకు సరైన దిశ, ప్రోత్సాహం అందించినప్పుడే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని సీఎంఆర్‌జీఐ గ్రూప్స్ చైర్మన్ గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం కండ్లకోయలోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రాజెక్టు పోటీ "సీఎంఆర్ థింక్‌ఫెస్ట్ 3.0" ఘనంగా ముగిసింది. ఫేస్ లో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి 125 బృందాలకు చెందిన 500 మందికి పైగా యువ ఆవిష్కర్తలు పాల్గొని తమ సాంకేతిక ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలు, వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. పరిశ్రమలకు చెందిన సీనియర్ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్తలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ప్రాజెక్టులను ఆవిష్కరణ స్థాయి, సాంకేతిక సాధ్యత, సామాజిక ప్రయోజనం, వాణిజ్యపరమైన అమలు సామర్థ్యం వంటి ప్రమాణాల ఆధారంగా సమగ్రంగా మూల్యాంకనం చేశారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మూడు బృందాలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.20 వేల, రెండో బహుమతిగా రూ.10 వేల, మూడో బహుమతిగా రూ.5 వేల ప్రదానం చేశారు.

అలాగే మరో రెండు ప్రతిభావంతమైన బృందాలకు రూ.2,500 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. విజేతలకు సీఎంఆర్‌జీఐ గ్రూప్స్ చైర్మన్ గోపాల్ రెడ్డి, సీఈఓ అభినవ్ రెడ్డి నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. శ్రీనివాస్ రావు, డీన్ (అకాడెమిక్స్) డా. దేవదాసు, సీఈఈఆర్ విభాగాధిపతి బి. సురేష్ రామ్‌తో పాటు వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**యువత ఆలోచనలే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది: గోపాల్ రెడ్డి**

భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారి ఆలోచనలకు సరైన దిశ, ప్రోత్సాహం అందించినప్పుడే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని "సీఎంఆర్‌జీఐ గ్రూప్స్ చైర్మన్ గోపాల్ రెడ్డి అన్నారు. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, సమాజంలో ఉన్న సమస్యలకు సాంకేతికత ఆధారంగా వినూత్న పరిష్కారాలను అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. సీఎంఆర్ థింక్‌ఫెస్ట్ వంటి వేదికలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువ ఆవిష్కర్తలు తమ ప్రతిభను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో సంతోషకరమని, ఇది పరస్పర విజ్ఞాన మార్పిడికి, కొత్త ఆలోచనల పుట్టుకకు దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా సీఎంఆర్ విద్యా సంస్థలు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తాయని, విద్యార్థులను ఉద్యోగార్థులుగా మాత్రమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణల సమన్వయంతో ప్రపంచ స్థాయి ప్రతిభను తయారు చేయడమే సీఎంఆర్ సంస్థల ప్రధాన లక్ష్యమని గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.



## మేడ్చల్ సీఐ అంజిరెడ్డిని సత్కరించిన మాజీ వైస్ ఎంపీపీ గొపని వెంకటేష్

**జయభేరి, మేడ్చల్:**
మేడ్చల్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిని మేడ్చల్ మండల మాజీ వైస్ ఎంపీపీ గొపని వెంకటేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ అంజిరెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాజీ వైస్ ఎంపీపీ గొపని వెంకటేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందిస్తూ, నేరాల నియంత్రణతో పాటు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సీఐ అంజిరెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. మేడ్చల్ ప్రాంతంలో ప్రజలకు భద్రతాభావం కల్పిస్తూ, పోలీసుప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటూ నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.మల్లేష్, ఎం గణేష్, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ నూతన సీఐ అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన రాఘవేందర్ గౌడ్

**జయభేరి, మేడ్చల్ :**
మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నూతన సీఐ అంజిరెడ్డికు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, పూల బొకే అందజేశారు.




అనంతరం మేడ్చల్ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఖాన్ (యూసుఫ్), జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కనకాల శివకుమార్ (బిపిటి రాజు), మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ, ఇర్ఫాన్, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, కటిక వినయ్, రవితేజ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ వేద పాఠశాలలో మెహందీ వేడుకలు

- గోరింటాకుతో సందడి విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఆనందోత్సాహాలతో పాల్గొన్న చిన్నారులు

**జయభేరి, పరకాల, ఆగస్టు 1:**
శాయంపేట మండలం పెద్దకొడపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో శనివారం మెహందీ (గోరింటాకు) ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థినులకు గోరింటాకుతో అలంకరించి సంప్రదాయాల విశిష్టతను వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రతి ఆచారానికి శాస్త్రీయ కారణం ఉందన్నారు. గోరింటాకు వేయడం వల్ల శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడటంతో పాటు చర్మ ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ద్వారా పూర్వీకుల వారసత్వాన్ని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తి రెడ్డి, సౌందర్య, వేద, విద్యార్థులు పాల్గొన్నారు.



## బండమాధారం వార్డు అభివృద్ధికి ప్రాధాన్యం

- రజిత దేవేందర్ రెడ్డి
- రూ.16 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

**జయభేరి, మేడ్చల్ :**
బండమాధారం గ్రామ అభివృద్ధే లక్ష్యంగా వార్డులో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని బండమాధారం వార్డులో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి తో కలిసి వైస్ చైర్‌పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి స్మశానవాటిక వరకు అంతర్గత అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలే మా పాలనకు ప్రాధాన్యం అని బండమాధారం వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తూ ప్రజల సహకారంతో వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తాం అని రజిత దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

- బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు ఎండి. జానీబాబా

**జయభేరి, దేవరకొండ :**
ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 భృతి అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించి ఆటో కార్మికులను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు ఎండి. జానీబాబా ఆరోపించారు. శనివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రయాణికులు తగ్గిపోవడంతో ఆదాయం లేక బ్యాంకు రుణాల కిస్తీలు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్థిక భారంతో కుటుంబాలను పోషించడం కూడా కష్టంగా మారిందని, కొంతమంది ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మాట తప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలను అమలు చేసి ఆటో కార్మికులకు ప్రకటించిన రూ.12,000 వార్షిక భృతి అందించాలని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన లేదా ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సూక్య నాయక్, ఇసుబ్, చందు, పాండు, బొజ్జ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమా?

- గాజుల నిరంజన్, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు



**జయభేరి, పరకాల, ఆగస్టు 01:**
పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గర్భిణి మహిళ అంబులెన్స్‌లో ప్రసవించడం అత్యంత బాధాకరమైన ఘటన. 108 అంబులెన్స్ ఈఎంటీ భాస్కర్, పైలట్ అర్జున్ సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లి, శిశువు ప్రాణాలను కాపాడడం అభినందనీయం. అయితే, పరకాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినప్పటికీ నేటికీ ప్రారంభించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. అలాగే పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయానికి అందుబాటులో లేకపోవడం, పర్యవేక్షణ లోపించడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సరైన వైద్య సేవలు అందక ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే 100 పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పరకాల ప్రజల తరపున భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం.



## రంగు వినోద భౌతిక కాయానికి ఘన నివాళి

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాజీ ఎంపీటీసీ మహబూబ్ రెడ్డి



**జయభేరి, తొర్రూర్, ఆగస్టు 01 :**
పెద్దవంగర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంగు మురళి గౌడ్ మాతృమూర్తి శ్రీమతి రంగు వినోద ఈరోజు పరమపదించగా నేడు వారి స్వగ్రామం పెద్ద వంగర మండలం కొరిపల్లి గ్రామం లోని వారి ఇంటి వద్ద రంగు వినోద పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు మాజీ ఎంపీటీసీ జక్కన్న మహబూబ్ రెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి వీరి వెంట పెద్దవంగర మండలం కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు హరికృష్ణ, మోహన్ రావు,బోలాగాని శ్రీనివాస్ గౌడ్ ,యర్రం రాజు యాదవ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ఉగ్రగోదావరి.. 3వ ప్రమాద హెచ్చరిక జారీ

**జయభేరి, భద్రచాలం, ఆగస్టు 1 :**
భద్రాచలం వద్ద గోదావరి నది మహోగ్ర రూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు పోటెత్తడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 55.1 అడుగులకు చేరడంతో అధికారులు మూడో, చివరి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం కేవలం 30 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం, కాళేశ్వరం నుంచి వస్తున్న వరద ప్రవాహంతో శుక్రవారం అర్ధరాత్రికి 53 అడుగులకు, శనివారం ఉదయానికి 55.1 అడుగుల ప్రమాదకర స్థాయికి చేరింది. పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్.. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు.వరద ఉద్ధృతి కారణంగా పర్ణశాల వద్ద స్నానఘట్టాలు పూర్తిగా జలమయమయ్యాయి. సీతవాగు ఉద్ధృతికి సీతమ్మ నార చీరలు, దేవతామూర్తి పీఠంతో పాటు ఇనుప వంతెన కూడా మునిగిపోయాయి. దుమ్ముగూడెంభద్రాచలం మధ్య శుక్రవారం సాయంత్రం నుంచే రాకపోకలు నిలిచిపోయాయి. తురుబాక ఆర్ అండ్ బీ రహదారిపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి.చార్ల మండలం వీరాపురం శివారులోని ఇసుక క్వారీలో అకస్మాత్తుగా వరద రావడంతో 44 మంది లారీ డ్రైవర్లు, స్థానికులు చిక్కుకుపోయారు. అధికారులు వారిని సురక్షితంగా కాపాడారు. అయితే 30కి పైగా లారీలు అక్కడే నీటిలో చిక్కుకుపోయాయి. సహాయక చర్యల సమయంలో ఇద్దరు పోలీసు అధికారులు తెప్పపై నుంచి నీటిలో పడినా, ఈదుకుంటూ క్షేమంగా బయటపడ్డారు. అశ్వాపురం మండలంలో ఓ గర్భిణిని థర్మాకోల్ తెప్పపై సురక్షిత ప్రాంతానికి తరలించారు.మరోవైపు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణలో రాబోయే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది



## ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..
- పలువురికి గాయాలు

**జయభేరి, రంగారెడ్డి :**
చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండల పరిధి నాగర్గూడ గ్రామ సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.వేగంగా వచ్చిన ఓ లారీ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు.ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు వెంటనే నాగర్గూడలోని శ్రీనివాస ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాద విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు కాలే శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం..

# కరీంనగర్ లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా..

■ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి

**జయభేరి, కరీంనగర్ :**



కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ.20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి. అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీనరసింహ కాలనీలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు. అట్లాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు. అంతకుముందు చింతకుంట వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన 'వన మహోత్సవం2026 లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

కరీంనగర్ కార్పొరేషన్ లోని ప్రతి గల్లీగల్లీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా అభివృద్ధికి అంతగా నోచుకోని నగర శివారు గ్రామాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తనకు ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా క్రుషి చేస్తున్నా. అందుకోసం నా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రూ.22 వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టిన. పలు అభివృద్ధి పనులు చేసిన. త్వరలోనే వివిధ కేంద్ర పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నా.



## ఆల్ ఇండియా ఓబీసీ కన్వీనర్ తో కలిసి చందు గౌడ్ జన్మదిన వేడుకలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ యువ నాయకుడు చందూ గౌడ్ శనివారం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో ఉన్న మాజీ మంత్రి, కీర్తిశేషులు మూల ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ తో పాటు ఏఐసిసి ఆల్ ఇండియా ఓబీసీ కన్వీనర్ అంబర్ పెట్ శ్రీనివాస్ యాదవ్ తో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. జన్మదిన వేడుకలు సందర్భంగా చందు గౌడ్ అక్కడికి వెళ్లి వారితో కలిసి ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా చందూ గౌడ్ కు వారు స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాపతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టులో పెరుగుతున్న వరద

■ 29 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

■ ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,77,000 వేల క్యూసెక్కులు

■ అవుట్ ఫ్లో 1,76,000 వేల క్యూసెక్కులు



**జయభేరి, దేవరకద్ర :**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టులో రోజురోజుకు వరద పెరుగుతుంది. దీంతో శనివారం ప్రాజెక్టు 29 గేట్లు ఎత్తు దిగువకు నీటిని విడుదల చేశారు.ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టు లోకి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,77,000 వేల క్యూసెక్కులు. అవుట్ లో 1,76,000 వేల క్యూసెక్కులు. ఎగువ, దిగువ జూరాల విద్యుత్ కేంద్రాల నుంచి 11 యూనిట్లతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల కూడా కొనసాగుతుంది. ప్రాజెక్టులో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో జూరాల నిండుకుండను తలపిస్తుంది. నీటి రాకతో రైతుల ఆనందం వ్యక్తం అవుతుంది.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

■ కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్

■ కాకుంట్లలో మొక్కలను పంపిణీ చేసిన సర్పంచ్



**జయభేరి, దేవరకద్ర :**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం పాటు పడదామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ అన్నారు. కౌకుంట్లలో శనివారం గ్రామస్తులకు సర్పంచ్ మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి ఒక మొక్క చొప్పున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మాత్రమే కాదు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను చొప్పున నాటాలన్నారు. మన గ్రామం పచ్చదనంతో భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, ఉపసర్పంచ్ లక్ష్మీకాంతరావు, వార్డు సభ్యులు ఉప్పరి గోవిందమ్మ, కోడి సురేందర్, శాంతం రవీందర్ రెడ్డి, కావలి లక్ష్మణ్ లతోపాటు గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళను మోసం చేసిన ఎస్సై అరెస్టు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో మహిళలను వేధిస్తున్న పోలీసుల జాబితలో మరో ఎస్సై పేరు చేరింది. మహిళలపై లైంగిక దాడి కేసులో ఎస్సై శ్రీకాంత్ అరెస్ట్ అయ్యాడు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని మహిళలను మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి చేసినట్లు కేసు నమోదయింది. హైదరాబాద్ యువతి ఫిర్యాదుతో జగిత్యాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు. సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్లో పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్ను అరెస్ట్ చేసి హనుమకొండకు తరలించారు. నిందితుడు సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్సైగా గుర్తించారు.

# మంత్రి విస్తరణ లేనట్టే...

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 1 :**

హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు సాగించిన మూడు రోజుల సుదీర్ఘ చర్చలు, ఏఐసీసీ సమన్వయ కమిటీ భేటీల తర్వాత తేలిందేమిటంటే.. ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా సీనియర్లంతా ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.

దీంతో చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది.ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ లేదా రీషఫుల్ చేపడితే.. పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే భయం అధిష్ఠానంలో ఉంది. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, పార్టీ అంతర్గత రాజకీయంలోనూ చోటుచేసుకున్న పరిణామాలు, అసంతృప్తుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణలో ఉన్న శాంతిభద్రతలను, ప్రభుత్వ స్థిరత్వాన్ని దెబ్బతీసే సాహసం ఇప్పుడు చేయకూడదని హైకమాండ్ ఒక స్పష్టమైన ముగింపునకు వచ్చినట్లు తెలుస్తోంది.

మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల పోటీ ఊహించని మలుపులు తిరుగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంటి సీనియర్లు ఒకవైపు గట్టిగా ఒత్తిడి తెస్తుండగా.. జెన్‌జీ నినాదంతో యువ ఎమ్మెల్యేలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చ సరికొత్త సమీకరణాలను తెచ్చిపెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు వార్తలు రావడం, స్థానిక సంస్థల సమయానికి ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే వ్యూహాలు రేసును మరింత సంక్లిష్టంగా మార్చాయి. సీనియర్ వర్సెస్ జూనియర్, రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు.ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

పాలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం.

హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే.. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కేబినెట్‌ను కదిలించి తేనెతుట్టెను రేపడం కంటే ఉన్న వనరులతోనే పాలనను పరుగులు పెట్టించడం శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఢిల్లీ పర్యటనతో ఏదో ఒక శుభవార్త వింటామని భావించిన ఆశావహులకు అధిష్ఠానం రివర్స్ షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పదుల సంఖ్యలో ఉన్న మంత్రి పదవుల పోటీదారులకు చెక్ పెడుతూ, సర్కార్ గ్రాఫ్‌ను పెంచుకునే పనుల్లో నిమగ్నం కావాలని ఆదేశించడంతో.. తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతానికి మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది



## ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

■ దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

ఆగస్టు 15 నుంచి కొత్తపింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, నేత మరియు గీతా కార్మికులకు కూడా పింఛన్లు మంజూర య్యాయన్నారు. అలాగే ప్రతి గ్రామానికి తారు రోడ్డు, పంచాయతీ భవన నిర్మాణాలను చేపడతామన్నారు. అంతేకాకుండా ఇందిరమ్మ చీరల్లో నాణ్యత డిజైన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యత గల ఇందిరమ్మ చీరలు అందించాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఉందని జిఎంఆర్ అన్నారు.

## శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది

■ ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి

■ వారాంతపు కవాతుకు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి,

**జయభేరి, మహబూబ్ నగర్ :**

జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జానకి, సూచించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ కు జిన్ పింగ్

**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు1 :**



2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్-చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది.గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్-చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది.భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు.ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్‌పింగ్ పర్యటనపై- అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

# తొట్టెల బుట్టలకు ఫుల్ డిమాండ్

జయభేరి, హైదరాబాద్ :



బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధమైన పండుగలలో ఒకటి. ఈ పండుగలో అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతో ముఖ్యమైన ఘట్టం. అయితే, ఈ ఉత్సవాల్లో తొట్టెల సమర్పణ కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. భక్తులు తమ మొక్కులు నెరవేరాలని, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యం కోసం అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. ఈ సందర్భంగా, భక్తుల అభిరుచి, మొక్కుల ప్రకారం, తొట్టెల పరిమాణం మారుతుంది. కొందరు చిన్న తొట్టెలను సమర్పిస్తుంటే, మరికొందరు భారీ, ప్రత్యేకంగా తయారు చేసిన తొట్టెలను సమర్పించడం బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ తొట్టెల తయారీకి సంబంధించిన కళ, కార్వాన్, పురానాపూల్ ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా మారింది. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయ వృత్తిని నమ్ముకుని నేటికీ అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ తొట్టెలను వెదురు, రంగురంగుల కాగితాలు, అలంకరణ సామగ్రితో చేతిపనిగా రూపొందించడం జరుగుతుంది. ప్రతి ఏడాది, భక్తుల నుంచి ఈ తొట్టెలకు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్ కారణంగా, తొట్టెల ధరలు కూడా విభిన్నంగా ఉంటాయి. సాధారణ తొట్టెల ధరలు రూ.500 నుంచి ప్రారంభమవుతుండగా, భారీ



బహుళ అంతస్తుల తొట్టెల ధరలు రూ.2 లక్షల వరకు చేరుకుంటున్నాయి. ఈ ధరలు, తయారీకి ఉపయోగించే సామగ్రి, అలంకరణ, పరిమాణం ఆధారంగా మారుతుంటాయి.బోనాల ఉత్సవాల్లో తొట్టెల తయారీకి సంబంధించిన ఈ కళ, కేవలం ఆర్థిక వనరులే కాకుండా, సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి, యువతను ప్రోత్సహించడం, ఈ కళను నేర్పించడం అత్యంత అవసరం. ఈ విధంగా, భవిష్యత్తులో కూడా ఈ కళను కొనసాగించడానికి వీలు కల్పించవచ్చు. బోనాల ఉత్సవాలు, తెలంగాణ సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని, ఈ ఉత్సవాల్లో తొట్టెల తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, మన సంప్రదాయాలను మరింత బలపరిచే అవకాశం ఉంది.ఈ ఉత్సవాల్లో, తొట్టెల తయారీకి సంబంధించిన కుటుంబాలు, తమ కళను ప్రదర్శించడానికి, తమ ఉత్పత్తులను విక్రయించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాయి. ఈ సమయంలో, భక్తులు తమ ఇష్టానికి అనుగుణంగా తొట్టెలను ఎంచుకుంటారు. ఈ విధంగా, బోనాల ఉత్సవాలు, కేవలం ఆధ్యాత్మిక పండుగ మాత్రమే కాకుండా, ఆర్థికంగా కూడా కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ ఉత్సవాలు, తెలంగాణలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచుతున్నాయి. ఈ ఉత్సవాల ద్వారా, మన సంప్రదాయాలను, కళలను, మరియు సంస్కృతిని పునరుద్ధరించడానికి, ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

# రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం

- అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు
- తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ హెచ్చరిక

జయభేరి, మహబూబాబాద్ :



తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) శంకర్ నాయక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట ఉన్న భోజనశాలలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాల వద్ద లారీలు, బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా నిలిపివేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారి పక్కన నిలిపిన వాహనాలకు వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, నిలుపుదల దీపాలు, హెచ్చరిక త్రిభుజ గుర్తులు లేకపోవడం వల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు.

డ్రైవర్లు, వాహన యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం-1988, సెక్షన్ 122 ప్రకారం జాతీయ రహదారులపై అకారణంగా లేదా ఇతరులకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపి వేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి వాహనాల ఛాయాచిత్రాలు, దృశ్యాల ఆధారంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అదేవిధంగా వాహనాలు నిలిపివేయరాని ప్రాంతాల్లో వాహనాలను నిలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలను వదిలేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కఠిన చర్యలు తప్పవన్నారు. రవాణా శాఖ సూచనలు మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులు మినహా వాహనాలను నిలిపి వేయరాదు. వాహనాలను భోజనశాలలు, హోటళ్ల ముందు లేదా రహదారి అంచున ప్రమాదకరంగా నిలిపివేయరాదని, తప్పని సరిగా ఆపాల్సి వస్తే రహదారికి సురక్షితమైన దూరంలో మాత్రమే నిలిపివేయాలని, వాహనం వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, ప్రతిబింబించే పట్టీ, నిలుపుదల దీపాలు తప్పనిసరిగా ఉండాలి. రాత్రి సమయంలో ప్రతిబింబించే హెచ్చరిక త్రిభుజ గుర్తు ఏర్పాటు చేయాలని, వాహనాల సాంకేతిక సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్‌నెస్), బ్రేకులు, టైర్లు, దీపాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలి. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం పూర్తిగా నివారించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం ద్వారా ఒక ప్రకటన ద్వారా తెలపడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారులపై డీటీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ, "మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతే మా ప్రధాన లక్ష్యం. వాహన యజమానులు, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

# లక్ష కోట్లతో పీపీపీలు.. నెంబర్ వన్

జయభేరి, విజయవాడ, ఆగస్టు 1 :



భారతదేశంలో మౌలిక వసతుల విప్లవాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం రాష్ట్రాల వారీగా పిలిచిన ప్రతిపాదిత పీపీపీ ప్రాజెక్టుల విలువ, సంఖ్య పరంగా ఏపీ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1,15,578.81 కోట్ల అంచనా వ్యయంతో 270 మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది.దేశ వ్యాప్తంగా మొత్తం రూ. 17 లక్షల కోట్లకు పైగా విలువైన 852 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది. ఈ జాబితాలో తమిళనాడు రూ. 87,639.65 కోట్ల విలువైన 70 ప్రాజెక్టులతో రెండో స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రూ. 65,496.50 కోట్లతో 21 ప్రాజెక్టులతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అన్ని ర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికాభివృద్ధి, రోడ్లు, పోర్టులు, ఇంధన రంగం మరియు పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేసి కేంద్ర సమ్మతిని పొందింది. రహదారులు, ఓడరేవులు, లాజిస్టిక్ పార్కులు, ఇంధన రంగానికి చెందిన కీలక ప్రాజెక్టులను ఈ 270 ప్రతిపాదనల్లో పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు ఆంధ్రప్రదేశ్‌పై అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నిధుల కొరత లేకుండా పీపీపీ నమూనాలో ఈ మౌలిక ప్రాజెక్టులు పట్టాలెక్కితే, రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపు లభించనుంది.



## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జయభేరి, మేడ్చల్ :

33 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ పనుల దృష్ట్యా ఆదివారం (ఆగస్టు 2, 2026) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మేడ్చల్ విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా ఘనాపూర్, మెడిసిటీ చౌరస్తా, రాజాబొల్లారం విలేజ్, రాజాబొల్లారం తండా, ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు రాంబాబు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం సమయంలో వినియోగదారులు సహకరించాలని, నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమ అవసరాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఏఈ రాంబాబు విజ్ఞప్తి చేసింది.

## నందు ఆర్మీ ప్రీమియర్ లీగ్

- జాలే నరసింహారెడ్డి



జయభేరి, దేవరకొండ :

హైదరాబాద్ లోని గుర్రంగూడ ప్రాంతంలో నందు ఆర్మీ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నందు ఆర్మీ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తో కలిసి పాల్గొన్న జాలే నరసింహారెడ్డి, PACS చైర్మన్. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యానికే కాకుండా ఐక్యతకు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయి అన్నారు.. అదేవిధంగా ఆటలో గెలుపు ఓటములు సహజం కానీ నియమాలను పాటిస్తూ నిజమైన స్ఫూర్తితో ఆడటం ముఖ్యం అన్నారు, అదేవిధంగా వివిధ పోలీస్ శాఖలకు శిక్షణ తీసుకుంటూ టోర్నమెంట్ లో పాల్గొంటున్న అన్ని జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ టోర్నమెంట్ నిర్వహించిన నందు మారుమూల ప్రాంతం అయినటువంటి చందంపేట మండలంలో జన్మించి హైద్రాబాద్ మహా నగరంలో నందు ఆర్మీ అకాడమీని స్థాపించి ఎంతో మంది యువతి యువకులను తీర్చి దిద్దటమే కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయడం గొప్ప విషయం అని అభినందించడం జరిగింది.



## విభా స్కూల్‌లో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం విజయవంతం

జయభేరి, మేడ్చల్ :

విద్యార్థుల ఆరోగ్యమే వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది అనే లక్ష్యంతో విభా స్కూల్, మెడికవర్ హాస్పిటల్స్, క్లోవ్ డెంటల్ మరియు మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2026 (శనివారం) న పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించబడింది. ఈ శిబిరంలో విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, క్లోవ్ డెంటల్ వైద్యులచే దంత పరీక్షలు, మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ నిపుణులచే కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సంయుక్త నాగోజు మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడం మరియు చిన్న వయస్సులోనే ఆరోగ్య సమస్యలను గుర్తించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మెడికవర్ హాస్పిటల్స్, క్లోవ్ డెంటల్, మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ వైద్య బృందాలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు పాఠశాల యాజమాన్యం ఎంతో అభినందించారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకల్లో దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ లో శనివారం జరిగిన స్థానిక మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్ జన్మదిన వేడుకల్లో దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గౌడ్ ను యుగేందర్ రెడ్డి పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## తీదేడు గ్రామంలో మొక్కల పంపిణీ




జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం తీదేడు పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు.అనంతరం హారితహారం లో భాగం పల్లె ధావఖాన వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని,పచ్చదనం పెంపొందించేందుకు గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్,దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,మర్ల యాదగిరి,గ్రామ ప్రజలు,అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు,గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీటి కొరత ఏర్పడకుండా నల్లాల బాయిలో క్రొత్త సైడ్ బోర్లు



జయభేరి, సైదాపూర్ :

సైదాపూర్ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ వర్నే లావణ్యమోహన్, గ్రామ శాఖ అధ్యక్షులు కోలే అశోక్ తో గ్రామంలో నిర్మిస్తున్న గ్రామైక్య సంఘం (V.O) బిల్డింగ్ పనులను సందర్శించడం జరిగింది. అలాగే గ్రామంలో నీటి కొరత ఏర్పడకుండా నల్లాల బాయిలో క్రొత్త సైడ్ బోర్లను వేయడాన్ని పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాజు క్షమాభిక్ష.. 57 మంది మృతి!

## ఒక్క రాత్రిలో మారిన దేశ తలరాత



అటూ ఇటూ నీళ్లతో ముడిపడిన ఓ చిన్న నేలముక్క.. ఎప్పుడు ఏ వైపు నుంచి ముప్పు ముంచుకొస్తుందో తెలియని ఉత్కంఠ వాతావరణం. స్పెయిన్ ఆధీనంలో ఉంటూ ఆఫ్రికా తీరానికి ఆనుకుని ఉండే 'సీవుటా' నగరం ఇప్పుడు సరిగ్గా అలాంటి అభద్రతా భావాన్నే అనుభవిస్తోంది. సముద్రం ఒడ్డున ఐరోపా యూనియన్ ను ఆఫ్రికా ఖండంతో ఉన్న ఏకైక భూ సరిహద్దు కావడంతో, మెరుగైన భవిష్యత్తు కోసం కనుపాపల్లో ఆశలతో బయలుదేరే వేలాది మందికి ఇది తొలి గమ్యస్థానంగా మారుతోంది. అయితే, కొన్ని గంటల వ్యవధిలోనే ఊహించని రీతిలో వేలాది మంది ఒకేసారి సరిహద్దులను బట్టాసు దాటుకుంటూ రావడం నగరంలో తీవ్ర కలకలం రేపింది. స్థానిక వ్యవస్థలన్నీ ఒక్కసారిగా స్థంభించి పోవడంతో సీవుటా ప్రస్తుతం ఎమర్జన్సీ పరిస్థితులను ఎదుర్కొంటోంది. సోషల్ మీడియా పుకారే ప్రధాన కారణమా? సరిహద్దుల్లో ఉన్నట్టుండి ఇంతపెద్ద ఎత్తున మానవ ప్రవాహం ప్రత్యక్షం కావడం వెనుక మానవ అక్రమ రవాణా ముఠాల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరిహద్దులు తెరుచుకున్నాయని, భద్రత సడలించారంటూ సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్‌ల ద్వారా ప్రచారమైన తప్పుడు వార్తలే ఈ అల్లకల్లోలానికి మూలమని తెలుస్తోంది. మొరాకో కొత్త రాజు ప్రమాణ స్వీకారం సందర్భంగా "వేలాది మంది ఖైదీలకు రాజు క్షమాభిక్షలు ప్రసాదించారు. వెంటనే దేశం విడిచి వెళ్లాలనే" ఫార్వర్డ్ మెసేజ్ ఈ వలసల వరదకు కారణమైంది. పేదరికం, నిరుద్యోగంతో అల్లాడుతున్న వేలాది మంది యువకులు, కుటుంబాలు నిజానిజాలు తెలుసుకోకుండానే 'ఇదే మంచి సమయం' అనుకుని ఒక్కసారిగా సరిహద్దుల వైపు పరుగులు తీశారు. కొందరు ఎత్తైన కంచెలను దాటేందుకు ప్రయత్నించగా, మరికొందరు ప్రాణాలకు తెగించి సముద్ర మార్గంలో ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. కేవలం రెండు మూడు రోజుల్లోనే దాదాపు 60 వేల మంది వరకు ఈ చిన్న ఎన్‌క్లేవ్‌లోకి ప్రవేశించడంతో స్థానిక యంత్రాంగం చేతులెత్తేసింది. ఈ ప్రమాదకర ప్రయాణంలో 57 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గతంలో 2021లోనూ ఇక్కడ ఇలాంటి ఘటనే జరిగి సుమారు 10,000 మంది చొరబడ్డారు. కానీ ఈసారి ఆ సంఖ్య ఐదు రెట్లకు పైగా ఉండటం గమనార్హం.

రద్దయిన వేడుకలు ఈ అకస్మాత్తు పరిణామంతో సీవుటా నగరంలో సాధారణ జీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. భద్రతా కారణ దృష్ట్యా వ్యాపార సంస్థలన్నీ మూతపడ్డాయి. కేవలం మెడికల్ షాపులు మాత్రమే పనిచేస్తున్నాయి. నిత్యావసర సరుకులు, పాలు, రొట్టెలు కూడా దొరకని పరిస్థితి నెలకొనడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నగర ప్రభుత్వం నిర్వహించాల్సిన వార్షిక ఉత్సవాలను సైతం రద్దు చేసింది. రోడ్లపై ఎటు చూసినా గందరగోళం, అలజడి రాజ్యమేలుతున్నాయి. రంగంలోకి సైన్యం.. స్పెయిన్, మొరాకోల సంయుక్త చర్యలు భద్రతను పునరుద్ధరించేందుకు స్పెయిన్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. స్థానిక పోలీసులకు అదనంగా సరిహద్దుల్లో బలగాలను, సైనిక దళాలను మోహరించింది. స్పెయిన్ ప్రధాని స్వయంగా ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు మొరాకో అధికారులు కూడా సరిహద్దు సమీపంలో నిఘాను తీవ్రతరం చేశారు. సరిహద్దు ఒప్పందాల ప్రకారం అర్హత లేని వారిని తిరిగి మొరాకోకు పంపించే ప్రక్రియను వేగవంతం చేశారు. అంతర్జాతీయ స్థాయికి చేరిన దౌత్యపరమైన వేడి ఈ వ్యవహారం కేవలం స్పెయిన్, మొరాకోలకే పరిమితం కాకుండా మొత్తం ఐరోపా సమాఖ్యను ఉలిక్కిపడేలా చేసింది. సరిహద్దుల భద్రతపై ఐరోపా దేశాల్లో మళ్లీ చర్చ మొదలైంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఫ్రెంచ్, ఇటలీ వంటి పొరుగు దేశాలు కూడా నిఘాను పెంచాయి. తాత్కాలిక పునరావాస కేంద్రాల ఏర్పాటు, బాధితులకు వైద్యం, ఆహారం అందించడం వంటి మానవతా దృక్పథంతో కూడిన చర్యలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ.. అసలు ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం ఏమిటనేది ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ప్రశ్నగా మారింది.

# తీవ్రస్థాయికి అమెరికాఇరాన్ వార్..! సై అంటే సై..!



మధ్య మరోసారి సవాళ్లు, ప్రతి సవాళ్ల పర్వం కొనసాగుతోంది. ఇరాన్ పై భారీ దాడులకు అమెరికా సైన్యానికి అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన తర్వాత మొదలైన ఈ మాటల యుద్ధం ఇవాళ పతాకస్థాయికి చేరింది. ఇరాన్ పై సైనిక చర్యలను విస్తరించే అవకాశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారని అమెరికా నుంచి సంకేతాలు వస్తున్న నేపథ్యంలో.. ఇరాన్ కూడా దీటుగా స్పందిస్తోంది. అమెరికా లేదా ఇజ్రాయెల్ నుండి తాజాగా సైనిక చర్య ఎదురైతే.. గల్ఫ్ ప్రాంతంలోని కీలక ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ఘాటు వార్నింగ్ ఇచ్చింది.

ఇరాన్ మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసే అవకాశం ఉందన్న వార్తలను ఒక రకమైన పిచ్చి గా ఆ దేశ భద్రతాధికారి ఒకరు అభివర్ణించారు.

టెహ్రాన్ ఇప్పటికే విస్తృత ప్రతీకార ప్రణాళికలను సిద్ధం చేసిందని, ఏ దాడి జరిగినా దానికి ప్రతిగా ఇజ్రాయెల్‌లోని కీలక మౌలిక సదుపాయాలపై, అలాగే ఈ ప్రాంతంలోని అమెరికా ఇంధన ఆస్తులపై దాడులు చేస్తామని ఆ ఆయన హెచ్చరించారు. దీంతో అమెరికాఇరాన్ మధ్య మరోసారి యుద్ధ వాతావరణం నెలకొంది.

గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని, శత్రుత్వాన్ని తీవ్రతరం చేస్తోందని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఆరోపించిన నేపథ్యంలో టెహ్రాన్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

ట్రంప్ ఈ ఉగ్రవాద చర్యను చూస్తూ ఊరుకోరని లీవిట్ వ్యాఖ్యానించారు. ట్రంప్ అర్థవంతమైనదిగా భావించే రీతిలో ఇరాన్ చర్చలకు వచ్చే వరకు మూల్యం చెల్లించుకుంటూనే ఉంటుందని తేల్చేసారు. మరోవైపు ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన ఇంధన రవాణా మార్గాలలో ఒకటైన హార్ముజ్ జలసంధి గుండా వెళ్లడానికి ప్రయత్నిస్తున్న రెండు చమురు ట్యాంకర్లపై దాడి చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. మరో నాలుగు ట్యాంకర్లు తమ మార్గాన్ని మార్చుకుని వెనుదిరిగాయని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.

# స్టాలిన్ కు రాహుల్ కీలక పిలుపు..!

## డీలిమిటేషన్ బిల్లు వేళ కీలక పరిణామం..!



గత పార్లమెంట్ సమావేశాల్లో లోక్ సభలో డీలిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుతో కలిపి ప్రవేశపెట్టిన బీజేపీ.. దాన్ని నెగ్గించేందుకు అవసరమైన 2/3 వంతు మంది ఎంపీల మద్దతు సాధించలేకపోయింది. దీని వెనుక తమిళనాడుకు చెందిన ఎంపీలు కీలక పాత్ర పోషించారు. అందులోనూ అప్పటి అధికార పక్షం, ప్రస్తుతం విపక్షంలో ఉన్న డీఎంకే ఎంపీలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో ఆ బిల్లు పార్లమెంట్ లో వీగిపోయింది. అయితే ఇప్పుడు తమిళనాడులో పరిస్థితులు మారాయి. కాంగ్రెస్ పార్టీ డీఎంకేను కాదని విజయ్ ప్రభుత్వంలో చేరింది. ఈ పరిణామాన్ని అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ తహతహలాడుతోంది. దీంతో డీఎంకే ఎంపీలు ఈసారి కచ్చితంగా తమకు మద్దతుగా నిలుస్తారనే అంచనాతో డీలిమిటేషన్ బిల్లును మరోసారి పార్లమెంట్ ముందుకు తెస్తోంది. టీఎంసీ, ఆప్, శివసేన పార్టీల్ని చీల్చి, ఆ ఎంపీల మద్దతు కూడా కలుపుకుని డీలిమిటేషన్ బిల్లు నెగ్గించుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో విపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. విజయ్ కు తాము మద్దతివ్వడంపై గుర్రుగా ఉన్న మాజీ సీఎం, డీఎంకే అధినేత స్టాలిన్ ను ఉద్దేశించి ఇవాళ ఓ కీలక పిలుపునిచ్చారు. పైకి మాత్రం అన్ని తమిళ పార్టీలకూ, ఎంపీలకు అని రాహుల్ పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, తమిళనాడు ప్రజల ఓటు హక్కును ,, అధికారాన్ని హరించడమే ఈ పునర్విభజన ఉద్దేశమని, ఇది బీజేపీ పన్నాగమని రాహుల్ గాంధీ ఇవాళ ఆరోపించారు. పునర్విభజనకు మద్దతు ఇచ్చే ఎవరైనా తమిళనాడుకు ద్రోహం చేస్తున్నట్లే అన్నారు. వారు తమిళనాడు భవిష్యత్తుకు ద్రోహం చేస్తున్నారని, తమిళనాడు ప్రజలపై, ఆ రాష్ట్ర భవిష్యత్తుపై దాడి చేయడానికి బీజేపీకి అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఇది 21వ శతాబ్దపు దాడి అన్నారు. ఏ తమిళుడూ ఈ పునర్విభజనకు మద్దతు ఇవ్వకూడదన్నారు. ప్రతి తమిళుడూ దీనిని వ్యతిరేకించాలన్నారు. ప్రతి తమిళ పార్టీ, అలాగే ప్రతి జాతీయ పార్టీ కూడా సభలో ఈ పునర్విభజనను ఓడించాలన్నారు.

# అజిత్ దోబాల్ కు లోకమాన్య తిలక్ అవార్డు

■ అమిత్ షా ప్రశంసలు



జయభేరి, న్యూఢిల్లీ:

నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోబాల్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. భారత విదేశాంగ విధానం, జాతీయ భద్రత అంశంలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. 2014 నుంచి దేశ భద్రత, భవిష్యత్తు కోసం ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ప్రతి చిన్న నిర్ణయం వెనుక అజిత్ దోబాల్ ఉన్నారని తెలిపారు. ఈ మేరకు శనివారం పుణెలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోబాల్ ప్రతిష్ఠాత్మక లోకమాన్య తిలక్ అవార్డును అందుకున్నారు. అనంతరం అమిత్ షా ప్రసంగించారు. దోబాల్ సేవలను గుర్తు చేశారు. జాతీయ భద్రతను మరింత దృఢంగా మార్చే విషయంలో నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోబాల్ వ్యూహాత్మక సూచనలు, సలహాలు ఎంతో విలువైనవి.. రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో ఆయన తన సహకారం అందించారని అమిత్ షా కొనియాడారు. ఆయన కృషికి గానూ భారత చరిత్రలో ఒక గోల్డెన్ పేజీ అజిత్ దోబాల్ కు ఉంటుందని ప్రశంసించారు. " భారత విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో అజిత్ దోబాల్ కృషి మరువలేనిది. ఎప్పుడైనా చరిత్రను లిఖిస్తే.. అంతర్గత భద్రత, బహిర్గత భద్రత గురించి మాట్లాడితే అజిత్ దోబాల్ కు గోల్డెన్ పేజీ ఎప్పుడూ ఉంటుంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదు" అని అమిత్ షా స్పష్టం చేశారు. 2014 లో దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి నిర్ణయాల్లో ఒకటి అజిత్ దోబాల్ ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించడం అని అమిత్ షా స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత విదేశాంగ విధానం అత్యుత్తమ స్థాయిలో ఉంది. మనం మన స్థానాన్ని ప్రపంచంలో సుస్థిరంగా ఏర్పాటు చేసుకున్నాం.. అని అమిత్ షా పేర్కొన్నారు. 2014 లో అజిత్ దోబాల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ లో ఆధునిక హంగులు దిద్దడంలో.. టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర మరువలేనిది.. అని తెలిపారు. అజిత్ దోబాల్ కృషిని ఎప్పుడూ ప్రజల ముందు పెట్టలేదు.. అందుకు ఇంటెలిజెన్స్, భద్రతా పరమైన కారణాలు ఉన్నాయని అమిత్ షా స్పష్టం చేశారు. తాను గుజరాత్ హోమ్ మంత్రిగా ఉన్నప్పుడు అహ్మదాబాద్ సీరియల్ బాంబ్ బ్లాస్ట్ ఘటన సమయంలో అజిత్ దోబాల్ తో చర్చించిన అంశాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ.. గుజరాత్ పోలీసులకు ఒక్కటే సూచన చేశారని.. అజిత్ దోబాల్ చెప్పినట్లు చేయాలని తెలిపినట్లు అమిత్ షా గుర్తుచేసుకున్నారు. అజిత్ దోబాల్ మా ఇంటికి వచ్చిన సంగతి నాకు ఇంకా గుర్తుంది. ఆయన ఇచ్చిన సూచనలు, సలహాలతో గుజరాత్ పోలీసులు కేవలం అహ్మదాబాద్ బాంబ్ దాడులు మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా 13 బాంబ్ బ్లాస్ట్ ఘటనలను ఛేదించారు. ఇది అతి పెద్ద విజయం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

# గ్రామైక్య సంఘం బిల్డింగ్ పనుల పరిశీలన



జయభేరి, సైదాపూర్ :

సైదాపూర్ మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మేకల భాగ్యలక్ష్మిక్రాంతితో కలిసి గ్రామంలో నిర్మిస్తున్న గ్రామైక్య సంఘం (V.O) బిల్డింగ్ పనులను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రియుడిపై మోజు భర్తనే చంపాలనుకుంది..

జయభేరి, చిత్తూరు :

ప్రియుడిపై మోజుతో భర్త, పిల్లలను వదిలేసి వివాహిత వేరే కాపురం పెట్టింది. మొదట భర్తను చంపాలనుకొని స్కెచ్ వేసి.. తర్వాత మనసు మార్చుకొని పారిపోయి ప్రియుడిని పెళ్లి చేసుకుంది. చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం గుడి కొత్తూరు గ్రామానికి చెందిన చిరంజీవికి శోభ(27) అనే మహిళతో 8 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నేపథ్యంలో రాంగ్ కాల్ ద్వారా శోభకు గుంటూరు జిల్లా కండ్రిగకు చెందిన బాలాజీ నాయక్(22) పరిచయమయ్యాడు. ఇన్స్టాగ్రామ్లో చాట్ ద్వారా మరింత స్నేహం పెరిగి ఈ జంట ప్రేమలో పడింది. ఈ విషయం తెలిసి తన భర్త రోజూ కొడుతున్నాడని మొదట అతన్ని హత్య చేసి, ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకుందామని భార్య ప్లాన్ వేసింది. తర్వాత మనసు మార్చుకొని నెల రోజుల క్రితం పారిపోయి కుప్పంలో ఓ గుడిలో శోభ, బాలాజీ నాయక్ పెళ్లి చేసుకున్నారు. భర్త తన భార్య శోభ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ క్రమంలో శోభ మరో యువకుడితో కలిసి బెగ్గిలిపల్లిలో ఉంటున్నట్టు గుర్తించి వారిని భర్త చిరంజీవి తరపు బంధువులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. శోభ తనను పెళ్లి చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందని, ఆమె బలవంతంతో పెళ్లి చేసుకున్నానని ప్రియుడు బాలాజీ నాయక్ తెలిపాడు. తన భర్త రోజూ అనుమానంతో వేధించి కొట్టేవాడని.. ఆ దెబ్బలు చూసి బాలాజీ నాయక్ తన భర్తను చంపుతానంటే వద్దని పారిపోయి వచ్చి పెళ్లి చేసుకున్నానని భార్య శోభ అంటోంది. ఈ గొడవను పరిష్కరించలేక పోలీసులు తలలు పట్టుకున్నారు.



# రష్యన్ భామల బ్యూటీ సీక్రెట్స్!

**రష్యా పడతులు.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తారు. లేత గులాబీ వర్ణంలో.. అందానికి సరికొత్త నిర్వచనంగా మెరిసిపోతుంటారు. తాజాగా, వీరి బ్యూటీ సీక్రెట్స్‌ను వెల్లడించారు బ్యుటీషియన్లు. రష్యా మహిళల మేనిఛాయ రహస్యాన్ని బయటపెట్టారు.**

చర్మాన్ని శుభ్రపరచడానికి రష్యా మహిళలు 'బన్యా స్టీమ్‌బాత్'ను ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఈ స్టీమ్‌బాత్ వల్ల చర్మ రంధ్రాలు లోతుగా శుభ్రమవుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఈ పురాతన చర్మ సంరక్షణ పద్ధతితో.. మానసికశారీరక విశ్రాంతితోపాటు చర్మానికి మెరుపు, ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. ప్లాస్టిక్, రసాయన ఉత్పత్తులకు పూర్తిదూరంగా ఉంటారు. చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు బిర్చ్/ఓక్ కొమ్మలతో తయారైన స్క్రబ్‌లను ఉపయోగిస్తారు. వీటితో చర్మాన్ని సున్నితంగా మసాజ్ చేయడం వల్ల.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.ఎప్పుడూ చల్లగా, పొడిగా ఉండే రష్యాలో.. చర్మం పొడిబారుతూ ఉంటుంది. అందుకే, చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి కొన్నిరకాల సముద్రపు ఉత్పత్తులు, పొద్దుతిరుగుడు, ఆముదం నూనెను వాడుతారు.

వీటిలో చర్మ ఆరోగ్యాన్ని రక్షించే పోషకాలు, వృద్ధాప్య నిరోధక లక్షణాలు ఎక్కువ. అవి చర్మం, జుట్టుకు మంచి హైడ్రేషన్ అందిస్తాయి.

కోల్డ్ వాటర్ థెరపీ, ఐస్ ఫేషియల్స్‌తో చర్మాన్ని ఎప్పటికప్పుడు రిఫ్రెష్‌గా ఉంచుకుంటారు. ఈ థెరపీలతో ముఖచర్మం బిగుతుగా మారుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు ముడతలూ తగ్గుముఖం పడుతాయి.

ఇక కళ్ల కింద వాపును నివారించడంలో కోల్డ్ వాటర్ థెరపీ అద్భుతంగా పనిచేస్తుంది.

రష్యన్ల సాంప్రదాయ మాస్క్‌లలో ఎక్కువగా ఉపయోగించే పదార్థాలు.. సోర్ క్రీం, తేనె. వంటింట్లో నిత్యం అందుబాటులో ఉండే ఈ పదార్థాలు.. చర్మాన్ని తేమగా, కాంతివంతంగా ఉంచుతాయి.

ఇక క్లెన్సర్లుగా పాల ఉత్పత్తులకు ఓటేస్తారు రష్యన్ అమ్మాయిలు. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సాయపడుతుంది. చర్మం పీహెచ్ సమతుల్యతను కాపాడటంతోపాటు చర్మ సహజవర్ణాన్ని మెరుగుపరచడంలోనూ ముందుంటుంది.

..ఇలా రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడకుండానే రష్యన్ అమ్మాయిలు అందాన్ని కాపాడుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ.. 'బ్యూటీ'కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.



# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు..
# మంచిగా పడుకోవాలంటే...

**ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది.**

కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం.

ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి. ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్ర లేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.

ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు. ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది.

దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

### ఎవరెవరికి ఎంతెంత?

ఏడాదిలోపు పసిపిల్లలకు.. రోజుకు 12 నుంచి 16 గంటల నిద్ర అవసరం ఉంటుంది.

ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులు 11 నుంచి 14 గంటలు నిద్రపోవాలి.

మూడు నుంచి ఐదేళ్లలోపు వారికి .. రోజుకు 10 నుంచి 13 గంటలు నిద్రపోతే ఆరోగ్యం. పాఠశాలకు వెళ్లే ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లలు రోజుకు 9 నుంచి 12 గంటలు నిద్రపోవాలి. యుక్త వయసులోకి వచ్చిన వారు ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల వరకు నిద్రించాలి.

### మంచి నిద్ర రావాలంటే..

పిల్లలు మంచి నిద్రపోయేలా వారి వయసుకు తగ్గట్లుగా కొన్ని అలవాట్లు చేయాలి. పడుకునే ముందు పిల్లలు రిలాక్స్ కావాలి. 'బెడ్ రొటీన్స్'ను అలవాటు చేయాలి. చిన్నారుల రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి.

అలాగే, రాత్రిపూట డిన్నర్ లైట్‌గా ఉండేలా చూసుకోవాలి. రాత్రిపూట నిద్రపోవడానికి మారాం చేసే పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే.. త్వరగా పడుకునే అవకాశం ఉంటుంది.

పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తే.. త్వరగా నిద్రపోతారు.

ఇంట్లో అందరూ ఒకే సమయానికి నిద్రపోతే.. వారితోపాటు పిల్లలూ నిద్రలోకి జారుకుంటారు.

సాయంత్రంపూట పిల్లలు ఔట్‌డోర్స్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడాలి.

దీనివల్ల వారి శరీరం అలిసిపోయి.. త్వరగా నిద్రపోవడానికి ఆస్కారం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

*(NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)*





# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.
శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్

సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





# వేరొకరి ఇయర్ బడ్స్ వాడుతున్నారా.?

**ఇది తెలిస్తే ఇంకోసారి ఆ జోలికి వెళ్లరు..**

నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరి వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ కచ్చితంగా ఉంటున్నాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్నప్పుడైనా పాటలు వినడానికి లేదా ఫోన్ మాట్లాడటానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉపయోగపడతాయి. అయితే, చాలామంది తమ ఇయర్ బడ్స్ అందుబాటులో లేనప్పుడు లేదా స్నేహితులు పంపిన ఏదైనా ఆడియో వినడానికి వారి ఇయర్ బడ్స్‌ను మార్చుకుని వాడుతుంటారు. ఇలా ఇతరుల బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ వాడటం అనేది అత్యంత ప్రమాదకరమని, ఇది నేరుగా చెవి ఇన్ఫెక్షన్లను కొనితెచ్చుకోవడమేనని వైద్యులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.
వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒకరి ఇయర్ బడ్స్‌ను మరొకరు పంచుకోవడం అనేది తీవ్రమైన అపరిశుభ్రమైన అలవాటు. ఇది ఎంత అసహ్యకరమైన అలవాటంటే, వేరొకరు వేసుకుని చెమట పట్టిన సాక్సులను మనం వేసుకోవడం కంటే కూడా ఘోరమైనదని వైద్యులు పోల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఒక్కరి చెవి లోపలి భాగంలో కొంత శాతం సహజమైన బ్యాక్టీరియా, వ్యాక్స్, ఫంగస్ ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తుల శరీర తత్వానికి అనుగుణంగా ఉంటాయి. అయితే, మనం ఇతరుల ఇయర్ బడ్స్‌ను మన చెవిలో పెట్టుకున్నప్పుడు, వారి చెవిలో ఉండే ఆ ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్ కణాలు ఆ ఇయర్ బడ్స్ ద్వారా నేరుగా మన చెవిలోకి ప్రవేశిస్తాయి.
ఇలా ఇతరుల బ్యాక్టీరియా మన చెవిలో చేరడం వల్ల చెవి లోపలి భాగంలో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు దారితీస్తాయి. దీనివల్ల చెవిలో భరించలేనంత తీవ్రమైన దురద, విపరీతమైన నొప్పి, చెవిలో నుంచి పసుపు రంగు ద్రవాలు కారడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. సమస్య మరింత తీవ్రమైతే అది వినికిడి లోపానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. అందుకే పర్సనల్ హైజీన్లో భాగంగా ఇయర్ బడ్స్ అనేవి కేవలం మీ వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కావాలి. 'మీ ఇయర్ బడ్స్‌ను ఎవరికీ ఇవ్వకండి, ఇతరులవి మీరు అస్సలు వాడకండి' అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరొకరిది వాడాల్సి వచ్చినా లేదా మీ ఇయర్ బడ్స్‌ని ఇతరులు వాడినా.. వాటిని తిరిగి ఉపయోగించే ముందు శానిటైజర్ లిక్విడ్ లేదా ఆల్కహాల్ వైప్స్‌తో పూర్తిగా క్లీన్ చేసిన తర్వాతే వాడటం సురక్షితం.



# నిద్రలేచిన తర్వాత ఎలా గడపాలో తెలుసా?

**హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ ఏం చెబుతున్నారంటే.. ఉదయం వేళల్లో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా శరీరంలోని సిర్కాడియన్ రిథమ్‌ను సమతుల్యం చేసుకోవచ్చు. దీంతో శరీరం సహజమైన శక్తిని పొందడమే కాకుండా, మెరుగైన నిద్ర కూడా లభిస్తుంది.**

**ఉదయాన్నే సూర్యరశ్మిని ఆస్వాదించండి**
నిద్రలేచిన 30 నుంచి 60 నిమిషాలలోపు కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు సహజ సూర్య కాంతిలో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరంలో కార్టిసాల్ హార్మోన్ సమతుల్యంగా విడుదల కావడానికి సహాయపడుతుంది. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రలేవగానే కాఫీకి దూరంగా ఉండండి**
చాలామంది నిద్రలేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు కలిగి ఉంటారు. అయితే శరీరం సహజంగా మేల్కొనే ప్రక్రియకు సమయం ఇవ్వడం అవసరం. అందుకే కనీసం 60 నుంచి 90 నిమిషాల తర్వాత కాఫీ లేదా టీ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందుగా నీళ్లు తాగండి**
రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరంలో కొంత మేర నీటి లోపం ఏర్పడుతుంది. అందువల్ల ఉదయం లేవగానే సుమారు 500 మిల్లీలీటర్ల నీరు తాగడం ద్వారా శరీరానికి తేమను అందించవచ్చు. ఇది జీవక్రియలను చురుకుగా చేయడంలో కూడా సహాయపడుతుంది.

**తేలికపాటి వ్యాయామం చేయండి**
ఉదయం కొద్దిసేపు నడవడం, ఒళ్ళు విరుచుకోవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం ద్వారా శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ఇది మెదడుకు రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని పంపి ఏకాగ్రత, శక్తిని పెంచుతుంది. నిద్రలేవగానే సోషల్ మీడియా, మెసేజ్‌లు లేదా ఈమెయిల్స్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం మొదటి గంటలో మొబైల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం మంచిది.

**స్నూజ్ బటన్ నొక్కకండి**
అలారం మోగిన ప్రతిసారి స్నూజ్ బటన్ నొక్కడం వల్ల మెదడు మళ్లీ నిద్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. దీంతో అలసట, నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అలారం మోగగానే లేవడం ఉత్తమం.

**పోషకాలు ఉన్న అల్పాహారం తీసుకోండి**
ఉదయం అల్పాహారం రోజంతా శక్తిని అందించే ముఖ్యమైన భోజనం. అధిక చక్కెర కలిగిన ఆహారాలకు బదులుగా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.

**ఆరోగ్యకరమైన ఉదయమే ఆరోగ్యకరమైన రోజుకు పునాది**
ఉదయం వేళల్లో ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా శరీర ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, మంచి నిద్ర కూడా పొందవచ్చు. చిన్న మార్పులతో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రోజును ఆరోగ్యకరమైన ఉదయంతో ప్రారంభించడం అవసరం.

# సెంట్రల్ జోన్ సారథిగా పాటిదార్..

- స్క్వాడ్‌లో రింకూ, దూబే..!

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పాటిదార్ దేశవాళీ క్రికెట్లో బిజీ కానున్నాడు. త్వరలో మొదలయ్యే దులీప్ ట్రోఫీలో పాటిదార్ సెంట్రల్ జోన్‌ను నడిపించాడు. ఈ ఐపీఎల్ విజేతను కెప్టెన్‌గా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. టీ20 చిచ్చరపిడుగు రింకూ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

దేశవాళీ సీజన్ 2026, 27లో మొదటిదైన దులీప్ ట్రోఫీకి తెరలేవనుంది. ఇప్పటికే ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ తమస్క్వాడ్‌ను ప్రకటించాయి. శనివారం సెంట్రల్ జోన్ సెలెక్టర్లు ఐపీఎల్ విన్నర్ రజత్ పాటిదార్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు.

రింకూ సింగ్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించిన సెలెక్టర్లు.. ఇటీవలే టీ20ల్లో అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్‌ను పేస్ దళంలోకి తీసుకున్నారు.

శ్రీలంక పర్యటనకు ఎంపికైన సరాన్ష్ జైన్ ఆల్‌రౌండర్ కోటాలో చోటు దక్కించుకోగా.. వికెట్ కీపర్లుగా ఆర్యన్ జుయల్, కునాల్ సింగ్ రాథోడ్ స్క్వాడ్‌లోకి వచ్చారు. స్పిన్నర్ హర్ష్ దూబే కూడా 15మందిలో స్థానం సంపాదించాడు. జూలై 31న ఉజ్జయిని దేవాలయంలో మహాకాళేశ్వరుడిని కుటుంబం సమేతంగా దర్శించకున్నాడు పాటిదార్.

**ఆగస్టు 23 నుంచి**

బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆగస్టు 23న దులీప్ ట్రోఫీ మొదలవ్వనుంది. డిఫెండింగ్ ఛాంపియనైన సెంట్రల్ జోన్ నేరుగా సెమీఫైనల్ ఆడనుంది. ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మ్యాచ్ విజేతను ఆగస్టు 30న పాటిదార్ సేన ఢీకొట్టనుంది. సెప్టెంబర్ 6వ తేదీన ఫైనల్ జరుగనుంది.

**సెంట్రల్ జోన్ స్క్వాడ్:** రజత్ పాటిదార్(కెప్టెన్), ఆర్యన్ జుయల్(వికెట్ కీపర్), సరాన్ష్ జైన్, అమన్ మొఖడె, కునాల్ ఛండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, రింకూ సింగ్(వైస్ కెప్టెన్), ఆయుష్ పాండే, యశ్ రాథోడ్, హర్ష్ దూబే, కునాల్ సింగ్ రాథోడ్(వికెట్ కీపర్), యశ్ ఠాకూర్, నచికెట్ భుటే.



# భువనేశ్వర్‌కు చోటు, పంత్‌పై వేటు..

- వన్డే ప్రపంచకప్ కోసం జట్టును ప్రకటించిన అశ్విన్..!
- అశ్విన్ 2027 వరల్డ్ కప్ స్క్వాడ్ ప్రకటన
- పంత్, సంజూలకు దక్కని చోటు
- భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేసిన అశ్విన్

2027 ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, టీమిండియా జట్టు కాంబినేషన్‌పై ఇప్పుడే చర్చలు మొదలయ్యాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా దేశాలు 2027 అక్టోబర్ 4 నుండి నవంబర్ 21 వరకు ఈ టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. 2027 వన్డే ప్రపంచకప్ కోసం తన డ్రీమ్ జట్టును ప్రకటించాడు.

ఓ వీడియోలో మాట్లాడిన రవిచంద్రన్ అశ్విన్.. ఆటగాళ్లను మూడు కేటగిరీల్లో విభజించాడు. 'ఎస్ (ఖచ్చితంగా జట్టులో ఉండేవారు)', 'మేబీ (బహుశా చోటు దక్కొచ్చు)', 'నో (చోటు దక్కదు)' అనే మూడు కేటగిరీల్లో ఆటగాళ్ల పేర్లు వెల్లడించాడు.

అశ్విన్ 'ఎస్' కేటగిరీలోని ఆటగాళ్లు..

శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, భువనేశ్వర్ కుమార్.

యశస్వి జైశ్వాల్, రుతురాజ్ గైక్వాడ్, వరుణ్ చక్రవర్తి, రవీంద్ర జడేజా, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ కృష్ణ.

**నో (చోటు దక్కదు) కేటగిరీలోని ఆటగాళ్లు..**

రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, రవి బిష్ణోయ్, శివమ్ దూబే, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్.

కాగా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఈ టోర్నీలో ఆడించాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అందుకోసం ప్రపంచ కప్‌కు ముందు అతనికి క్రమం తప్పకుండా ఆడే అవకాశం ఇవ్వాలని సూచించాడు. "నేనే సెలక్టర్ అయితే.. భువనేశ్వర్ కుమార్‌ను తప్పకుండా ఎంపిక చేస్తాను. నేను అతడితో మాట్లాడతాను. అతడిని అన్ని టోర్నమెంట్‌లు, ఫస్ట్‌క్లాస్, విజయ్ హజారే, అన్నీ ఆడేలా చేసి, దక్షిణాఫ్రికాకు వెళ్లేందుకు సిద్ధం చేస్తాను. అక్కడ అతడు భారత జట్టుకు అవసరమని నేను నమ్ముతున్నా" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. కాగా భువీ.. ఆర్సీబీ.. వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. గత సీజన్‌లో 16 మ్యాచ్‌లలో 28 వికెట్లు తీశాడు. 17.89 సగటు, 7.95 ఎకానమీ రేటుతో టోర్నమెంట్‌లో రెండో అత్యధిక వికెట్ టేకర్‌గా నిలిచాడు.




# వన్డే ప్రపంచకప్ 2027లో సరికొత్త ట్విస్ట్

- గ్రూప్ స్టేజ్, సూపర్ 7, సెమీస్ మ్యాచ్‌లు
- వన్డే ప్రపంచకప్ పూర్తి రూట్ మ్యాప్ ఇదే

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిస్తున్న ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఐసీసీ సరికొత్త రివాంప్డ్ ఫార్మాట్‌ను ప్రకటించింది. మొత్తం 14 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో పోటీని మరింత ఆసక్తికరంగా మార్చడానికి మూడు ప్రధాన దశలను ప్రవేశపెట్టారు. ముందుగా అత్యల్ప ర్యాంక్ కలిగిన 3 జట్లు 'సూపర్ సిరీస్' ఆడి ఒకటి గ్రూప్ స్టేజ్‌కు అర్హత సాధిస్తుంది. ఆపై 12 జట్లు రెండు గ్రూప్‌లుగా (6 చొప్పున) విడిపోయి 30 మ్యాచ్‌లు ఆడతాయి. ఆ తర్వాత సూపర్ 7, సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.

పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచ కప్ 2027కు సంబంధించి ఐసీసీ.. వేదికలను ఖరారు చేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో ఈ మెగా టోర్నీ జరుగుతుందని వెల్లడించింది. మొత్తంగా 12 వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయని పేర్కొంది. మొత్తం 57 మ్యాచ్‌లకు దక్షిణాఫ్రికాలోని ఎనిమిది నగరాలు, జింబాబ్వేలో మూడు నగరాలు, నమీబియా రాజధాని విండ్ హోక్ ఆతిథ్య వేదికలుగా ఎంపికయ్యాయి.

**ఈ టోర్నీ ఫార్మాట్ ఎలా ఉండనుంది?**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పురుషుల వన్డే ప్రపంచకప్ 2027 కోసం సరికొత్త, ఆకర్షణీయమైన ఫార్మాట్‌ను అధికారికంగా విడుదల చేసింది. గత 2 ఎడిషన్ల (2019, 2023) మాదిరిగా కాకుండా, ఈసారి పాల్గొనే జట్ల సంఖ్యను 10 నుంచి 14కు పెంచారు. ప్రతి మ్యాచ్‌లోనూ తీవ్రమైన పోటీ, ఉత్కంఠ నెలకొనేలా టోర్నీ ఫార్మాట్‌ను ఐసీసీ పూర్తిగా మార్చివేసింది.

కొత్త ఫార్మాట్ ప్రకారం టోర్నమెంట్ మూడు ప్రధాన దశల్లో సాగుతుంది. మొదటి దశగా 'సూపర్ సిరీస్' జరుగుతుంది. క్వాలిఫై అయిన 14 జట్లలో అత్యల్ప ర్యాంక్ ఉన్న చివరి మూడు జట్లు (12, 13, 14 ర్యాంకర్లు) రౌండ్‌రాబిన్ పద్ధతిలో తలపడతాయి. ఈ సిరీస్‌లో అగ్రస్థానంలో నిలిచే విజేత జట్టు ప్రధాన గ్రూప్ స్టేజ్ రౌండ్‌లోకి అడుగుపెడుతుంది. మిగిలిన రెండు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.

రెండో దశ అయిన 'గ్రూప్ స్టేజ్'లో మొత్తం 30 మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఈ దశలో 12 జట్లను 'గ్రూప్ 1', 'గ్రూప్ 2' గా ఆరేసి జట్ల చొప్పున విభజిస్తారు. ప్రతి గ్రూప్‌లోని జట్లు మిగిలిన ఐదు జట్లతో రౌండ్‌రాబిన్ పద్ధతిలో పోటీపడతాయి. ఈ దశ ముగిసేసరికి రెండు గ్రూప్‌ల నుంచి చెరో టాప్ 3 జట్లు (మొత్తం 6) నేరుగా తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. వారితో పాటు రెండు గ్రూప్‌లలో కలిపి పాయింట్లు, రన్ రేట్ ఆధారంగా 'నెక్స్ట్ బెస్ట్' స్థానంలో నిలిచే నాలుగో జట్టు కూడా అర్హత సాధిస్తుంది.

ఈ ఏడు జట్లు మూడో దశ అయిన 'సూపర్ 7'లోకి అడుగు పెడతాయి. సూపర్ 7 దశలో మొత్తం 21 రౌండ్‌రాబిన్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

ఈ రౌండ్ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో నిలిచే మొదటి నాలుగు జట్లు (P1, P2, P3, P4) సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మొదటి సెమీఫైనల్‌లో P1, P4, రెండో సెమీఫైనల్‌లో P2, P3 తలపడతాయి. ఈ సెమీఫైనల్ విజేతలు విశ్వవిజేత కిరీటం కోసం ఆఫ్రికా గడ్డపై ఫైనల్ మ్యాచ్‌లో పోటీపడతారు.






## ఫైనల్లో తన్వి శర్మ

**జయభేరి, న్యూఢిల్లీ:**

భారత యువ షట్లర్ 17 ఏండ్ల తన్వి శర్మ తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో తన్వి 2117, 2111తో లోకల్ షట్లర్, ప్రపంచ 24వ ర్యాంకర్ హువాంగ్ యుహుసున్‌ను చిత్తు చేసింది. కేవలం 33 నిమిషాల్లోనే ముగిసిన ఈ ఏకపక్ష పోరులో తన్వి బలమైన స్ట్రోక్స్, క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో చెలరేగిపోయింది. మరో సెమీఫైనల్లో అథ్లెట్ ఉన్నతి హుడా 1521, 1821తో ప్రపంచ 21వ ర్యాంకర్ తుయ్ లిన్ ఎన్‌గుయెన్ (వియత్నాం) చేతిలో ఓటమి పాలైంది. ఆదివారం జరిగే ఫైనల్లో ఆరో సీడ్ ఎన్‌గుయెన్ తన్వి తలపడనుంది.

## సెమీస్‌కు శ్రీజ



**జయభేరి, న్యూఢిల్లీ:**

కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత ప్యాడ్లర్లు అన్ని విభాగాల్లోనూ సెమీఫైనల్ చేరుకున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ 40 (1311, 114, 119, 1210)తో ఇంగ్లండ్‌కు చెందిన టిన్ టిన్ హోను చిత్తు చేయగా, యశస్విని ఘోర్పడే 40తో ఆస్ట్రేలియా ప్యాడ్లర్ కాన్‌స్టాంటినాను ఓడించింది. సిండ్రెలా దాస్ 42తో టాప్ సీడ్ ఆస్ట్రేలియా ప్లేయర్ యాంగ్జీ ల్యూకు షాకివ్వగా.. సుతీర్థ ముఖర్జీ 41తో మిన్ హ్యూంగ్ జీ (ఆస్ట్రేలియా)ని ఓడించింది. పురుషుల క్వార్టర్స్‌లో టాప్ సీడ్ మానుష్ షా 42తో ఆదిత్య సరీన్ (ఆస్ట్రేలియా)ను ఓడించి ముంద ంజ వేయగా.. పయాస్ జైన్, అంకుర్ భట్టాచార్జీ, మానవ్ ఠక్కర్ కూడా సెమీస్‌లో అడుగుపెట్టారు.

## అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ భార్య ఆత్మహత్య



**జయభేరి, రోహతక్:**

అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ షీలూ బల్‌హరా భార్య 23 ఏళ్ల ముస్కాన్ బల్‌హరా ఆత్మహత్య చేసుకున్నది. రోహతక్ జిల్లాలోని బాహూ అక్బార్‌పుర్ గ్రామంలో ఆమె బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ఘటన పట్ల దర్యాప్తు కొనసాగుతోందని రోహతక్ ఎస్పీ గౌరవ్ రాజ్‌పురోహిత్ తెలిపారు. కుటుంబసభ్యుల స్టేట్మెంట్ రికార్డు చేస్తున్నారు. షీలూ బల్‌హరను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు ఎటువంటి ప్రకటన రిలీజ్ చేయలేదు. ముస్కాన్ కుటుంబ సభ్యులు షీలూ ఇంటి ముందు ధర్నా చేశారు. తన కూతుర్ని వేధింపులకు గురి చేసినట్లు ఆరోపించారు. ఫోరెన్సిక్ బృందం ఆ ఇంటిని తనిఖీ చేసింది. ఆధారాలను సేకరించారు. రోహతక్‌లోని పీజీఐఎంఎస్ ఆస్పత్రికి ముస్కాన్ మృతదేహాన్ని తీసుకెళ్లారు. మెహంలోని ఫర్మానా గ్రామానికి చెందిన ముస్కాన్ 2023 డిసెంబర్‌లో షీలూను పెళ్లి చేసుకున్నది. ఆ ఇద్దరికీ 9 నెలల కుమారుడు ఉన్నాడు. షీలూ తొలుత జూడో, రెజ్లింగ్‌లో శిక్షణ పొందాడు. ఆ తర్వాత అతను తన కెరీర్‌ను కబడ్డీపై ఫోకస్ పెట్టాడు. షీలూకు 'హర్యానా ఆలా చీతా'గా పేరున్నది. కబడ్డీలో ప్రత్యర్థి ఆటగాళ్లను ఈజీగా పట్టేస్తాడు. భారత జట్టు తరపున విదేశాల్లోనూ అతను మ్యాచ్‌లు ఆడాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రోజు .. ముస్కాన్ తన ఇన్‌స్టాలో ఓ పంజాబీ పాటకు చెందిన రీల్‌ను పోస్టు చేసినట్లు తెలిసింది.



మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ అవ్వడం వలన పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. సోహా అలీ ఖాన్ నిర్వహించిన 'ఆల్ అబౌట్ హర్' యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, 2015 నాటి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్ ) పేపర్ లీక్ ఉదంతం తనపై ఎంత తీవ్రమైన మానసిక ప్రభావాన్ని చూపిందో వివరించారు. ఎంతో కష్టపడి ప్రిపేర్ అయిన తర్వాత పరీక్ష రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన కాలమని ఆమె తెలిపారు. వైద్య వృత్తిపై మక్కువతో తాను ఎంతో ఇష్టపడే కూచిపూడి నృత్యం, పెయింటింగ్ వంటి వాటిని ఒక సంవత్సర కాలం పాటు పూర్తిగా పక్కన పెట్టానని, తన సంతోషాలన్నింటినీ త్యాగం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత మిస్ వరల్డ్ 2017 కిరీటాన్ని గెలుచుకున్న మానుషి, ఆ తర్వాత అనూహ్యంగా సినిమాల్లోకి ప్రవేశించారు. 'సమ్రాట్ పృథ్వీరాజ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె, ఆ తర్వాత 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు.



## 'కింగ్‌డమ్'కు ఏడాది.. ఫ్లాప్ మూవీ అయినా సోషల్ మీడియాలో ట్రెండ్ ఎందుకు?

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా, దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'కింగ్‌డమ్' విడుదలై ఏడాది పూర్తైంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయినప్పటికీ, ఇప్పుడు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. సుమారు రూ.130 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన 'కింగ్‌డమ్'.. శ్రీలంక నేపథ్యంలోని యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. ఇందులో అండర్‌కవర్ కాప్ సూరి పాత్రలో విజయ్ దేవరకొండ నటించారు. అక్రమ ఆయుధాల రవాణా, క్రిమినల్ కార్టెల్, తప్పిపోయిన అన్న కోసం చేసే అన్వేషణ చుట్టూ కథ సాగుతుంది. చివర్లో విజయ్ దేవరకొండ డబుల్ రోల్ ట్విస్ట్ కూడా ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. అయితే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, విజయ్ మేకోవర్‌కు ప్రశంసలు వచ్చినప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం, స్క్రీన్‌ప్లేలో బలహీనతలు ఉండటంతో సినిమా మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.82 కోట్ల గ్రాస్ మాత్రమే వసూలు చేయడంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. సినిమా విడుదలై ఏడాది పూర్తైన సందర్భంగా సోషల్ మీడియాలో 1YearForKingdom హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. విజయ్ దేవరకొండ అభిమానులు సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు, గ్రాండ్ విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, హీరో స్క్రీన్ ప్రెజెన్స్‌ను గుర్తుచేసుకుంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు. అయితే ఈ ట్రెండ్‌పై నెటిజన్లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అభిమానులు "సరైన కథ, బలమైన స్క్రీన్‌ప్లే ఉంటే 'కింగ్‌డమ్' బ్లాక్‌బస్టర్ అయ్యేది" అని అభిప్రాయపడుతుండగా, మరికొందరు "ఫ్లాప్ అయిన సినిమాను ఇప్పుడు ఎందుకు ట్రెండ్ చేస్తున్నారు?" అంటూ కామెంట్లు చేస్తున్నారు.మరికొందరు మాత్రం సినిమా కాన్సెప్ట్ బాగానే ఉన్నప్పటికీ, కథను మరింత ఆసక్తికరంగా చెప్పి ఉంటే ఫలితం పూర్తిగా మారేదని అభిప్రాయపడుతున్నారు. ఇంకొందరు అభిమానులు ఈ సినిమా హిట్ అయ్యి ఉంటే సీక్వెల్‌పై ఇప్పటికి భారీ అంచనాలు ఉండేవి అని పోస్టులు చేస్తున్నారు. 'లైగర్' తర్వాత విజయ్ దేవరకొండకు ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, 'కింగ్‌డమ్'పై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆ సినిమా కూడా నిరాశపరచడంతో ఇప్పుడు ఆయన తదుపరి ప్రాజెక్టులపై అందరి దృష్టి పడింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాలతో అయినా ఆయన మళ్లీ విజయాల బాట పట్టాలని అభిమానులు ఆశిస్తున్నారు.

## ఓటీటీలోకి రూ.100 కోట్ల సినిమా..?



Lenin Movie | టాలీవుడ్ హీరో అఖిల్ అక్కినేని కెరీర్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన సాలిడ్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. ఎన్నో అంచనాల మధ్య థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా, అఖిల్ కెరీర్ లోనే తొలి వంద కోట్ల గ్రాస్ క్లబ్ లో చేరి సరికొత్త రికార్డ్ సృష్టించింది. థియేటర్లలో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఈ చిత్రం, ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ 'జీ5' (ZEE5) దక్కించుకుంది. ఈ మేరకు మేకర్స్, జీ5 అధికారికంగా స్ట్రీమింగ్ డేట్‌ను ప్రకటించారు. ఆగస్ట్ 7 నుంచి ఈ బ్లాక్ బస్టర్ మూవీ జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు తెలిపారు. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు మరియు అక్కినేని అభిమానులు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయడానికి ఇది చక్కటి అవకాశం అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి ఎస్.ఎస్. థమన్ అదిరిపోయే సంగీతం అందించగా, సూర్యదేవర నాగవంశీ మరియు నాగార్జున సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మించారు. అఖిల్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన ఈ సినిమా ఓటీటీలో ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.



## అమ్మబాబోయ్.. చూస్తే మతిపోవాల్సిందే

ఆ చిన్నదాని పేరు తనయ సచ్‌దేవా. ముంబైలో పుట్టి పెరిగిన ఈ బ్యూటీ.. పలు హిందీ, తెలుగు చిత్రాల్లో నటించింది. సినీ ఇండస్ట్రీకి రాకముందు మోడలింగ్ ద్వారా పలు పాపులర్ యాడ్స్‌లో నటించింది. అలాగే టీవీలోనూ తన సత్తా చాటింది. 'కహి సుని' అనే టీవీ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న తనయ.. హిందీలో 'పరచేడ్' అనే బోల్డ్ మూవీతో బీటౌన్‌కు పరిచయమైంది. ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో 'దోచేయ్' చిత్రంతో అరంగేట్రం చేసింది. దోచేయ్ సినిమాలో హీరో చెల్లెలి పాత్రలో నటించింది. ఆమె కనిపించిన కొంత సేపు తన నటనతో ఆకట్టుకుంది. అలాగే ఆతర్వాత పలు ప్రైవేటు ఆల్బమ్ సాంగ్స్‌తో పాటు ఓపీఎస్, లవ్ స్కాండల్స్ అండ్ డాక్టర్స్ లాంటి వెబ్ సిరీస్‌లలో అలరించింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం సినిమాలు, సిరీస్ లతో ఫుల్ బిజీగా గడిపేస్తుంది. ఇక సోషల్ మీడియాలో రెగ్యులర్ గా యాక్టివ్‌గా ఉండే ఈ భామ.. లేటెస్ట్ అప్‌డేట్స్, హాట్ హాట్ పోజులతో కుర్రాళ్లకు కిర్రెక్కిస్తుంది. హీరోయిన్ లాంటి అందం ఉన్న ఈ భామ ఎందుకు పెద్దగా అవకాశాలు అందుకోలేకపోతుంది అంటూ నెటిజన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ అమ్మడు షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోలు సోషల్ మీడియాలో కాక రేపుతున్నాయి. ఆ ఫోటోలకు నెటిజన్స్ తమదైన స్టైల్ లో కొంటె కామెంట్స్ చేస్తున్నారు.

## నందిని రెడ్డి చేతుల మీదుగా "క్రేజీ కల్యాణం" సినిమా టీజర్ లాంచ్



నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ నందిని రెడ్డి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నందిని రెడ్డి మాట్లాడుతూ "క్రేజీ కల్యాణం" సినిమా టీజర్ చాలా బాగుంది. డైరెక్టర్ భద్రప్ప ఎంటర్ టైనింగ్ గా మూవీ చేశారు. తరుణ్ భాస్కర్ క్యారెక్టర్ థియేటర్స్ లో పేలుతుంది. నరేష్ గారి క్యారెక్టర్ కు కూడా మంచి రెస్పాన్స్ దక్కుతుంది. అనుపమా మళ్లీ కామెడీ జానర్ లో క్యారెక్టర్ చేయడం హ్యాపీగా ఉంది. టీజర్ చూస్తే మూవీలో కావాల్సినంత వినోదం ఉంటుందని అనిపిస్తోంది. థియేటర్స్ లో విజిల్స్ వేసి ఎంజాయ్ చేసే సినిమా అని తెలుస్తోంది. కొత్త డైరెక్టర్ చేసినట్లు కాకుండా ఎక్స్‌పీరియన్స్డ్ డైరెక్టర్ లా భద్రప్ప ఇంప్రెషన్ క్రియేట్ చేస్తున్నారు. మా బ్రదర్ జగన్మోహన్ రెడ్డి ఈ సినిమాతో హిట్ కొట్టాలి. ఈ సినిమా 100 కోట్ల రూపాయల వసూళ్లు చేసి హిస్టరీ క్రియేట్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు.

హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ ఇది క్రేజీ కల్యాణం సినిమా కాబట్టి క్రేజీగా చాలా మాట్లాడుకోవచ్చు. ఇది స్మాల్ అండ్ స్వీట్ ఫిలిం. ఈ కథ చెప్పేందుకు భద్రప్ప వచ్చినప్పుడు చాలా ఇన్నోసెంట్ గా కనిపించారు. రెండున్నర గంటలు కథ చెప్పారు. ఆయన ఇచ్చిన నెరేషన్ లో హిలేరియస్ సీన్స్, ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. ఈ కథ వింటూ నవ్వీ నవ్వీ కడుపు నొప్పి వచ్చింది. కథ విన్నాక భద్రప్ప ఈ సినిమా నేను చేస్తాను, నువ్వు చెప్పింది చెప్పినట్లు తీస్తే ఈ సినిమా హిట్ అవుతుంది అని చెప్పాను. ఈ క్యారెక్టర్ తో పాటు మొత్తం స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. ఈ సినిమా క్యూట్ గా, హిలేరియస్ గా, రిలేటబుల్ గా ఉంటుంది. డైరెక్టర్ ఇచ్చిన నెరేషన్ ను నమ్మి నేను ఈ సినిమా చేశాను. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యింది. డబ్బింగ్ కూడా పూర్తి చేశాను. ఫిలింమేకింగ్ లో ఒక కొత్త దర్శకుడు భద్రప్ప చూపించిన ప్రతిభకు గర్వపడుతున్నా. ఆయన తొలి చిత్ర దర్శకుడు అని ఎవరూ అనుకోరు. నేను చెప్పిందే రూపొందించాలని ఆయన అనుకోరు. మేము ఎన్నో సీన్స్ కు డిస్కస్ చేసుకుని చేశాం. మన సూచనలకు విలువ ఇస్తారు. నిర్మాత జగన్మోహన్ గారు కూడా ఎవరేం చెప్పినా అది సినిమా మంచి కోసమే కదా అని అనుకుంటారు. నరేష్‌తో నేను చేస్తున్న మూడో చిత్రమిది. అఖిల్ రాజ్ చాలా మంచి పర్ ఫార్మర్. ఇలాంటి మంచి చిత్రానికి మీరంతా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**